ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 19 ఆగస్టు 2024 | 3





ప్రకృతి రాఖీ

రాజుకున్న.. 'పోలవరం' మంటలు!



పోలవరం ఫైల్స్ దగ్ధంపై నిప్పు రాజుకుంది.. ఇటు ఉన్నతాధికారులు.. అటు పాలకల్లోనూ మంటలు రేపింది. పోలవరం అక్రమాలు బయటకు రాకూడదనే ధవళేశ్వరంలోని పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లకు నిప్పు పెట్టారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ధవళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇదిలా ఉండగా కార్యాలయాన్ని ఆదివారం మంత్రి దుర్గేష్ సందర్శించి మండిపడ్డారు. మీ ఇంట్లో చెత్తను తగలబెట్టినట్టు ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్‌ను ఎలా తగలబెడతారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమగ్ర విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. - వివరాలు మెయిన్‌లో

ఓ అన్నా నీ అనురాగం..

రక్షా బంధన్.. పేరులోనే ఉంది రక్ష అని..
ప్రతి సోదరిసోదరుడు ఎదురుచూసే రోజు ఇది..
కాలంతో పాటే పరుగెడుతున్నా.. ఆ పరుగులో బంధాలు..
బంధుత్వాలకు సమయం కేటాయిస్తున్నారు.. నేటికీ విలువ ఇస్తున్నారు.. ఈ రోజు కోసం ఏడాదంతా ఎదురుచూసే వారెందరో.. ఓ అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం అంటూ సోదరి వచ్చే ఏడాదంతా రక్షణగా ఉండాలని రాఖీ కడుతుంది..నీకు నేను రక్షగా ఉన్నానంటూ అన్న ఆ రాఖీ కట్టించుకుంటాడు. ఇదే రక్షాబంధన్..
రాఖీ పండుగకు వయసుతో పనేముంది..
ఈ చిత్రంలోనే చూడండి.. నేడు రాఖీ పండుగ సందర్భంగా రాజమహేంద్రవరంలోని ఒక దుకాణం వద్ద రాఖీల కొనుగోలుకు అన్ని వయసుల మహిళలు ఎగబడ్డారు.. కడియం నర్సరీలలోనూ ప్రకృతి రాఖీలు కనువిందు చేస్తున్నాయి. అందరినీ అలరిస్తున్నాయి.





డబ్బు కొట్టు.. పోస్ట్ పట్టు!

బదిలీల్లో బాగోతం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

డబ్బు కొట్టు.. కుర్చీ పట్టు.. ఏ సీటు కావాలంటే ఆ సీటు మీదే.. సీటుకో రేటు మరి.. అక్కడ ఉన్న డిమాండ్‌ను బట్టి రేటు మారుతోంది.. ఇలా అధికారుల బదిలీల్లో భారీగా డబ్బు చేతులు మారుతోంది. కొందరు ప్రజా ప్రతినిధులు పోలీస్, రెవెన్యూ,ఇతర శాఖల అధికారుల బదిలీల్లో రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. పోస్టును బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు సమాచారం.గత వైసీపీ పాలకుల అరాచకం,దోపిడీకి తట్టుకోలేక సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పాతరేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత కూటమి నాయకులు అదే దారిలో పయనిస్తుండడంపై ముక్కున వేలేసుకుంటున్నారు.. ఒక్క పక్కన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై బిజీ బిజీగా ఉంటున్నారు.అయితే జిల్లాలో కూటమికి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల వైఖరి మాత్రం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

పోస్టును బట్టి రేటు..

కొత్తప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులు, అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి,ఇష్టానుసారం చట్టాలకు తూట్లు పొడిచిన వారిని సాగనంపే పనిచేస్తున్నారు. దీనినెవరూ కాదనరు. కానీ కొందరు డబ్బే పరమావధిగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం కొనసాగితే ఎంత ప్రమాదమో ప్రజలు గ్రహించి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బకొట్టారు. దీని నుంచి గెలిచిన నేతలు చాలా పాఠం నేర్చుకోవాలి. అయితే పాఠం సంగతి అటుంచి వైసీపీ నేతలు ఏ దారిలో పయనించారో అదే దారిని ఎంచుకోవడం చర్చనీయాంశమవుతోంది. ఇటీవల తహశీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు తదితర ఉద్యోగుల బదిలీలు జరిగాయి. జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు ప్రతి బదిలీకి ఒక రేటు కట్టినట్టు సమాచారం. ఇటీవల సీఐల పోస్టింగ్‌లలో సర్కిల్‌ను బట్టి రేటు కట్టి అది ఇచ్చిన వారికే పోస్టింగ్ ఇచ్చినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఓ మాదిరి సర్కిల్ అయితే రూ. 15 లక్షలు..డిమాండ్ ఉండే సర్కిల్ అయితే రూ.25 లక్షలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఒక నియోజకవర్గంలో సీఐ పోస్టుకు రూ.20 లక్షల వరకూ వసూలు చేసినట్టు సమాచారం. తహశీల్దార్ పోస్టుల్లోనూ ఇదే తీరీ నడిచిందని సమాచారం. ఒక నియోజకవర్గంలో ఒక తహశీల్దార్ పోస్టుకు రూ.16 లక్షల వరకూ డిమాండ్ చేసినట్టు సమాచారం.అయితే ఆ తహశీల్దార్ పోస్టు ఖాళీగానే ఉంది.పంచాయతీ రాజ్ శాఖలోనూ ఇదే విధంగా ఉంది. పోస్టును బట్టి రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో ఒక నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శి పోస్టుకు రూ.21 లక్షలు చెల్లించడానికి బేరం కుదిరినట్టు తెలిసింది.డబ్బు ఇస్తే చాలు గతంలో అతను వైసీపీకి అనుకూలంగా పనిచేశాడా.. నాయకులు,ప్రజలను ఇబ్బంది పెట్టాడా.. లేదా నేతలు చెప్పినట్టు చేశాడా అనే అంశాలు పట్టించుకోవడం లేదు.రేటు చెప్పి పోస్టులు అమ్ముకుంటున్నట్టు తెలిసింది.ప్రస్తుతం మేధావులు, అధికార వర్గాలు,రాజకీయ పార్టీల్లో ఇదే చర్చ జరుగుతోంది.

మీ చందా ఎంత?

ఎవరికీ అనుమానం రాకుండా నాయకులు కొత్త పంథా ఎంచుకున్నారు.దేవుడి పేరు చెప్పి పోస్టులు అమ్మకం పెడుతున్నారు. దేవుడి సంబరాలకు చందాలు వసూలు చేసే సమయం.. ఎక్కువ మొత్తంలో చందాలు లాగడానికి మీ ముందు దాత ఇంత ఇచ్చాడని ఎక్కువ ఇచ్చిన దాత వివరాలు చూపిస్తున్నారు. పోస్టు కోసం వచ్చిన అధికారికి అలా చూపిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అంటే అంతకంటే ఎక్కువ ఇస్తే పోస్టు ఖాయమని చెప్పడం దానర్థం అనమాట. గతంలో ఇదే జిల్లాలో వైసీపీ చెప్పినట్టు చేసిన అధికారులు పక్క పక్కనే పోస్టులు సంపాదించుకోవడం కూడా ఇటువంటి వాటిని ధ్రువీకరిస్తున్నాయి. ఇవన్నీ ఆయా ముఖ్య నేతలకు తెలిసే జరుగుతున్నాయా, వారి అనుచరులే బేరమాడి సెటిల్ చేస్తున్నారా అనే దానిపై స్పష్టత లేదు. ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉందో తెలి యదు కానీ కొందరు నేతలు మాత్రం చెడ్డపేరు తెచ్చుకుంటు న్నారు. ఇలా జిల్లాలో చాలా చోట్ల జరిగినట్టు తెలు స్తోంది. ఇంకా కొన్ని పోస్టులకు సిఫారసు లెటర్లు సిద్ధం చేయడం గమనార్హం. కొద్దిరోజుల్లో మరికొందరికి బదిలీలు ఉండే అవకాశం ఉంది. ఇలా చట్టా లను కాపాడవలసిన అధికారులు రూ.లక్షలు ఇచ్చి పోస్టింగ్‌లు తెచ్చుకుంటే ఇక వారి పనితీరు ఎలా ఉంటుందో ఊహించుకుంటూనే భయం కలుగుతుంది. పోస్టింగ్‌లలో రాజకీయ జోక్యం వల్ల చివ రకు డబ్బు ఇస్తేనే కానీ పోస్టింగ్ ఇవ్వని పరిస్థితి నెలకొంది.ఈ పరిస్థితి ఏ పరిణామాలకు దారి తీస్తుందోననే ఆందోళన అన్ని వర్గాల్లోనూ నెలకొంది.

- శాఖల వారీగా బదిలీలు
- నచ్చిన ప్లేస్‌కు ఒక రేటు
- డిమాండ్ ఉన్న స్థానానికో రేటు
- చందాలు అంటూ వసూళ్లు
- పోస్టులు కొంటున్న అధికారులు
- అన్ని విభాగాల్లోనూ ఇదే తీరు
- డిబ్బీలు తెరిచిన కూటమి నేతలు
- షాడో ఎమ్మెల్యేలదే పైచేయి
- ముఖ్య నేతలు దృష్టిపెట్టాల్సిందే

నాయకులు మేల్కొనాల్సిందే

జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ప్రతి నియోజకవర్గంలోనూ షాడో ఎమ్మెల్యేలు ఉన్నట్టు సమాచారం.అంటే ఎమ్మెల్యేకు తెలియకుండానే పనులు చక్కబెట్టేస్తారన మాట. ఈ పోస్టుల అమ్మకం అంతా వారే చూస్తున్నట్టు సమాచారం.దీంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులైనా కాలేదు.. అప్పుడే అవినీతి మరకలు అంటుకున్నాయి.ఇకనైనా కూటమి ప్రధాన నాయకులు మేల్కొనాల్సిందే.ఆరంభంలోనే ప్రక్షాళనపై దృష్టి పెట్టాల్సిందే.ప్రజాప్రతినిధులు తమ షాడోలపై ఒక కన్నేసి ఉంచాల్సిందే. ఏం జరుగుతుందనే దానిపై నిరంతరం ఆరా ఉండాల్సిందే.. లేదంటే మరిన్ని ఆరోపణలు ఎదుర్కోవాల్సిందే.

వ్యాధుల నియంత్రణకు చర్యలు : డీఎంహెచ్‌వో

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గోకవరం, ఆగస్టు18: జిల్లాలో డెంగీ, మలేరియా, డయేరియాతో పాటు, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు చేపడుతున్నట్టు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం "అమ్మో జ్వరం" అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటా నిరంతర జ్వరపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. లార్వా నిరోధక చర్యలు,దోమల పిచికారీ మందు, దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్, తదితర చర్యలను ఎప్పటికపుడు చేపడుతున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షల సౌకర్యాలు లేవని, ప్రభుత్వ పరీక్షా కేంద్రంలోనే నిర్ధారణ సౌకర్యాలు ఉన్నాయన్నారు.రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మైక్రో బయాలజీ ల్యాబ్‌కు మాత్రమే మ్యాక్ ఎలిసా పరీక్ష నిర్వహించే సామర్థ్యం ఉంద న్నారు. జిల్లాలో మలేరియా 1, డెంగీ 21 కేసులు నమోదయ్యాయన్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులకు ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు ముగ్గురు టీచర్లు

రంగంపేట,ఆగస్టు 18 : జాతీయ స్థాయి వృత్యంతర శిక్షణకు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రంగంపేట జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వి.రమ్యసుధ, హుకుంపేట, వెదుళ్ళపల్లి హైస్కూళ్ల నుంచి పి.లక్ష్మీపణికుమార్, ఎస్.శ్రీనివాసులు హాజరవుతున్నారు. ఈ మేరకు రంగంపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి ఆదివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్ బాడ్గాన్‌లో సీసీఆర్‌టీ రీజినల్ వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.ఆ తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు.దీనిలో భాగంగా విద్యావిధానంపై అవగాహన కల్పించనున్నారు.జాతీయస్థాయి శిక్షణ తరగతులకు ఎంపికవడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ఐదుగురు ఎస్ఐల బదిలీ

వీఆర్‌కు రాజమహేంద్రవరం వన్‌టౌన్ ఎస్ఐ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18 : తూర్పుగోదావరి జిల్లాలో ఐదుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ ఉత్తర్వుల మేరకు జిల్లాలో రాజమహేంద్రవరం డీఎస్‌బీలో ఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ఫణిమోహన్‌ను సీతానగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బదిలీ చేశారు. కొవ్వూరు స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జుబేర్ మహ్మద్‌ను రాజమహేంద్రవరం త్రీటౌన్‌కు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం డీఎస్‌బీ ఎస్ఐగా పనిచేస్తున్న సోమన శివప్రసాద్‌ను నగరంలోని ప్రకాష్‌నగర్ స్టేషన్‌కు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎండీ ఆసిఫాను వీఆర్‌లోకి పంపారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఐ జి.శ్రీహరిబాబును నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బదిలీ చేశారు.

రాజానగరంలో గంజాయి పట్టివేత 5



కార్పొరేషన్ ఎన్నికలెప్పుడో!

అందరి చూపు.. రాజమహేంద్రవరం వైపు

- ఐదేళ్లుగా ఎన్నికల్లేవ్
- భయంతో అడుగేయని వైసీపీ
- గత పాలకుల ఏకపక్ష నిర్ణయాలు
- పాలకమండలి లేక ఇష్టానుసారం
- వీడని విలీన గ్రామాల వివాదం
- 2027లో గోదావరి పుష్కరాలు
- కూటమి నిర్వహించాలని పట్టు
- ఇప్పటికే ఆశావహుల క్యూ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18 : చారిత్రాత్మక రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వైపే అందరి దృష్టి మరలుతోంది. రాజకీయ చైతన్యం కలిగిన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు పాలక మండలి ఎన్నికలు జరిగి ఐదేళ్లు గడిచిపోయాయి. అప్పటి నుంచి అధికారుల కనుసన్నల్లోనే పాలన సాగుతుంది. పాలకమండలి లేకపోవడంతో గత ప్రభుత్వంలో అనేక నిర్ణయాలు వైసీపీ ప్రజాప్రతినిధుల ఇష్టారాజ్యంగా మారాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించలేకపోయింది. దీనికి ప్రధాన కారణం ఓటమి భయం. ఎందుకంటే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ జయకేతనం ఎగురవేసింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు పెడితే టీడీపీ గెలుస్తుందని..వైసీపీ పనులకు చుక్కెదురవుతుందని వెనుకడుగువేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం, అటుపై ఆర్యాపురం బ్యాంక్ పాలక మండలి ఎన్నికల్లో కూడా కూటమి హవా కొనసాగడంతో ఇప్పుడు అందరి దృష్టి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థపై పడింది.

2002 నుంచి టీడీపీదే విజయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 2002 కుపూర్వం పురపాలక సంఘంగా ఉండేది.. అప్పటి టీడీపీ ప్రభుత్వం నగరపాలక సంస్థగా మార్చేసింది. కార్పొరేషన్‌గా అవతరించాక మూడు సార్లు ఎన్నికలు జరగ్గా టీడీపీ అభ్యర్థులు చక్రవర్తి, ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, పంతం రజనీ శేషసాయి వరుసగా మేయర్లుగా ఉన్నారు. అయితే 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చి జగన్ సీఎం అయ్యాక కార్పొరేషన్‌కు ఎన్నికలు జరపకుండా నిలుపుదల చేశారు. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు నగరపాలక సంస్థకు పాలక మండలి లేకుండా అధికారుల పాలనలో సాగుతుంది.

పుష్కరాలు వచ్చేస్తున్నాయి..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థగా అవతరించాక ఇప్పటికి రెండు పుష్కరాలు జరిగాయి. ఈ రెండు పుష్కరాలకు సీఎంగా చంద్రబాబు ఉన్నారు. నగరపాలక సంస్థకు పాలకమండలి లేకుండా ఈ వేడుక జరిగిన సందర్భాలు లేవు. అభివృద్ధి పనులపై ఇద్దరు శాసనసభ్యులు కో ఆప్షన్ సభ్యులుగా నగరపాలక సంస్థ పాలక మండలి కలిసి సమన్వయంతో నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగే పరిస్థితులు ఉన్నాయి.2027లో రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలను నిర్వహిస్తున్నందున రాజమహేంద్రవరం పాలక మండలికి ఈ ఏడాది డిసెంబరులోనే ఎన్నికలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 50 డివిజన్లలో ఉన్న జనాభా 2011 లెక్కల ప్రకారం 3 లక్షల 14 వేల మంది. 2021లో జనాభా లెక్కించాల్సి ఉండగా అది జరగలేదు.ప్రస్తుతం సుమారు 4 లక్షల పైబడి జనాభా ఉంటారు. ఇంకా పాత లెక్కల ప్రకారమే పరిగణిస్తున్నారు. ఓటర్ల విషయానికి వస్తే మహిళలు 96 వేలు పైబడి, పురుషులు 80 వేలు పైబడి ఉన్నారు.పది గ్రామాలు విలీనం చేస్తే సుమారు 5 లక్షల పైబడి జనాభా ఉంటారు.

పది గ్రామాల విలీనంపై సందిగ్ధం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో రూరల్ నియోజకవర్గం నుంచి 24 గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదన గతంలో టీడీపీ హయాంలో పెట్టిందే. అయితే వాటిని కొన్ని కేసులు, ఇతర గొడవల నేపథ్యంలో రూరల్‌లో వేమగిరి, ధవళేశ్వరం, బొమ్మూరు. హుక్కుంపేట,పిడింగొయ్యి, తొర్రేడు, కాతేరు, కోలమూరు, కొంతమూరు, లాలాచెరువు పది గ్రామాలకు కుదించారు. వాటికి గవర్నర్ రాజముద్ర కూడా పడింది. గత ప్రభుత్వంలో ఈ గ్రామాల విలీనానికి రైతులు ఒప్పుకోవడంలేదని సాకుగా చూపించి ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అప్పటి కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలతతో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేయించి డీఎంఏకు పంపారు. అక్కడ ఫైల్ పెండింగ్‌లో ఉంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం వైసీపీ పరాజయం చెందడం జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గత తీర్మానాన్ని రద్దు చేసి కోర్టు కేసులను పరిష్కరించుకుని వేగంగా విలీనం వైపు వెళుతుందా లేక వైసీపీ చేసిన తీర్మానం ప్రకారం విలీనం చేయకుండా కార్పొరేషన్ ఎన్నికలకు వెళుతుందా వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లలోనే ఈ పది గ్రామాలు కలిపే విధంగా వార్డుల పునర్విభజన జరిగింది.

ఇద్దరు ఎమ్మెల్యేల నిర్ణయాలే కీలకం





రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి ఇద్దరు ఎమ్మెల్యేలు కీలకం కాబోతున్నారు. పాలక మండలి ఏర్పడితే ఎక్స్‌అఫీషియో సభ్యులుగా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉంటారు. ఈ నేపథ్యంలో డిసెంబరులో ఎన్నికలకు వెళ్లాల్సివస్తే కూటమి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యేలు ఇద్దరు సమన్వయంతో ముందుకుసాగి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. విలీన గ్రామాలు,ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక, అటుపై పుష్కరాల ప్లానింగ్‌లోను ఇద్దరు ఎమ్మెల్యేల పాత్ర కీలకం కాబోతుంది. మొత్తానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నిర్ణయం ప్రకారం నగరపాలక సంస్థకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్ని కలు ఎప్పుడు పెట్టినా ఎన్నికల రణరంగంలోకి దిగి విజయాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి నుంచి ముఖ్యనేతలు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి పోటీ చేసేందుకు టీడీపీ నుంచి ఇద్దరు నేతలు సిద్ధంగా ఉండగా జనసేన నుంచి ఉత్సాహవంతులు ఉన్నారు. 2027 పుష్కరాలు కీలకం కాబట్టి ఈ సారి కౌన్సిల్‌లో ఉంటే చరిత్రలో నిలిచిపోతామనే ఆలోచనలో నాయకులు ఆశతో ఉన్నారు.



కరుణించమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, ఆగస్టు 18 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,20,788లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



విక్టరీ సింబల్ చూపుతున్న జాంపేట అర్బన్ బ్యాంక్ పాలకమండలి సభ్యులు

జాంపేట బ్యాంక్ పాలకవర్గం ఏకగ్రీవం

- తొలిసారిగా 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నిక
- ఛైర్మన్‌గా బొమ్మన జయకుమార్.. నేడు అధికారిక ప్రకటన

రాజమహేంద్రవరం,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పోటీలో ఉన్న ఇతర సభ్యులంతా తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 12 మంది డైరెక్టర్లతో పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పేర్లను ఆయన ప్రకటించారు. జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నికల చరిత్రలో ఏకగ్రీవం కావడం ఇదే తొలిసారి. సోమవారం ఎన్నికైన సభ్యులంతా సమావేశమై ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. ఛైర్మన్‌గా ప్రస్తుత సిట్టింగ్ ఛైర్మన్ బొమ్మన జయకుమార్ తిరిగి ఎన్నిక కానున్నారు. వైస్ ఛైర్మన్‌గా పోటీ ఉంది. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో మొదటి నియోజకవర్గం నుంచి బొమ్మన జయకుమార్, ప్రసాదుల హరనాథ్, ఆర్.విజయశేఖర్ (రొబ్బి), ఎం.లక్ష్మణరావు, జామిశెట్టి గాంధీ, ద్వారా పార్వతీసుందరి, కనకం నాగేశ్వరరావు, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు, రెండో నియోజకవర్గం నుంచి యాండ్రపు రామకృష్ణ, మూడో నియోజకవర్గం నుంచి జామికృష్ణ ఎన్నికయ్యారు.

పొలంలో గుళికలు చల్లుతుండగా అస్వస్థత 5





నాణ్యత లోపించిన దుశ్శర్తి-పోలవరప్పాడు రోడ్డు పనులు.. ఉపాధి హామీ పని కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఉపాధి రోడ్డులో నిధులు మింగేసిన ఇంజనీర్లు

- అడ్డతీగల మండలంలో న్యాయమూర్తుల పర్యటనలో వెలుగుచూసిన బాగోతం
- మెటల్ రోడ్డు పేరుతో అడ్డంగా దోపిడీ
- రూ.90 లక్షలతో చేపట్టిన మెటల్ రోడ్డు నిర్మాణమంతా డొల్ల
- ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఒక్కటై నిధుల స్వాహా?

రంపచోడవరం, ఆగస్టు 18: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉపాధి పనుల్లో ఇంజనీర్లు, గుత్తేదార్లు కుమ్మక్కై నిధులు మింగేసిన వైనమిది. అడ్డతీగల మండలంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో 2.5 కిలోమీటర్ల మేర దుశ్శర్తి-డి.పోలవరప్పాడు మెటల్ రోడ్డు నిర్మాణాన్ని 2023 ఆగస్టులో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. ఈ రహదారుల్లోని నాణ్యతా లోపాలు ఇటీవల కురిసిన వర్షాలతో బయటపడ్డాయి. ఇటీవల జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశబాబు, అడ్డతీగల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ పి.బాబు న్యాయవాదులతో కలిసి అడ్డతీగల జ్యూడీషియల్ మేజిస్ట్రేటు కోర్టు పరిధిలో రహదారులులేని గ్రామాలను పరిశీలించారు. అడ్డతీగల మండలంలోని దుశ్శర్తి పరిధిలోని డి.చోడవరం, పోలవరప్పాడు గ్రామాల సందర్శన చేసిన సందర్భంలో ఈ దుశ్శర్తి-పోలవరప్పాడు రోడ్డు అధ్వానస్థితి వారి దృష్టికి వచ్చింది. ఈ మెటల్ రోడ్డు నిర్మాణం జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టగా, ఇందులో ఈ రోడ్డు పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించడమేకాకుండా, ఇందులో మెటీరియల్ కోసం కూడా నిధులను కేటాయించారు. నిర్మాణంలో అనుసరించాల్సిన నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగించకపోవడం, సరైన రోలింగ్ చేయకపోవడం వంటి అనేక కారణాలు ఈ రోడ్డును అధ్వానస్థితికి తీసుకువచ్చాయి. ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో మెటల్‌ను వినియోగించిన దాఖలాలే కానరావడంలేదు. మొక్కుబడిగా మెటల్‌ను జల్లి, పరిసరాల్లో అందుబాటులో ఉన్న మట్టిని వినియోగించి నిర్మాణాన్ని కానిచ్చేశారు. నిశితంగా గమనిస్తే ఈ రోడ్డు నిర్మాణం మూలంగా ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి కలగడం, ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కలగడం అనే లక్ష్యానికంటే కేవలం ఇంజనీర్లు-గుత్తేదార్లకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఈ పని సాగింది. ఒక్క పనిని చూస్తేనే ఇలా ఉంటే మండలంలోనేకాకుండా ఏకంగా రంపచోడవరం ఐటీడీఏ మొత్తం పరిధిలో వందల కోట్ల రూపాయలను గుమ్మరించి ఇటువంటి పనులు ఎన్ని చేపట్టారో చూస్తే చాలావరకూ అన్ని పనుల్లోనూ ఇదే తరహా అక్రమాలు, నాణ్యతా లోపాలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. పనులన్నిటిపైనా సమగ్ర విచారణ జరిపితే బాగోతాలన్నీ బట్టబయలవుతాయని తెలుస్తోంది.

ఉపకారం పొందండి.. ప్రతిభే కొలమానం

- నిరుపేద విద్యార్థులకు కేంద్రప్రభుత్వ సహకారం
- ఏటా రూ.12 వేలు.. నాలుగేళ్లపాటు సాయం

తుని రూరల్, ఆగస్టు 18: ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. 8వ తరగతి చదివే పిల్లలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అందించి వారిని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 2024-25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 6 వరకు గడువుగా నిర్ణయించింది. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. గత ఏడాది జిల్లాలో 2 వేలమందికి పైబడి ఉపకారవేతనాలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది మరింత మంది ఉపకార వేతనాలు అందుకునే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించి శిక్షణ ఇస్తున్నారు.

అర్హతలు ఇవీ..

ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులకు 7వ తరగతిలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు 50శాతం మార్కులు రావాలి. కుల ఆదాయ ధ్రువపత్రాలతోపాటు 7వ తరగతి ఉత్తీర్ణత పత్రాలు ఉండాలి.

ఇదీ పరీక్ష విధానం

డిసెంబరు 8న ఉదయం 10 నుంచి 1గంట వరకు 180 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీంతో మెంటల్ ఎబిలిటీ 90 మార్కులు, స్టాటిస్టిక్ ఎబిలిటీ 90 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. 7,8 తరగతులకు చెందిన గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుంది. ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ www.esv.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. దరఖాస్తులకు సంబంధించి విద్యార్థుల పూర్తి వివరాలను ప్రధానోపాధ్యాయుల సమక్షంలో నమోదు చేసుకుని ఎస్సీఎస్టీ దివ్యాంగ విద్యార్థులు రూ.50, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100 ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

అన్నవరం దేవస్థానంలో.. గుర్తుతెలియని వ్యక్తి మృతి

అన్నవరం, ఆగస్టు 18: అన్నవరం దేవస్థానంలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అన్నవరం ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. అతడు దైవదర్శనానికి వచ్చిన వ్యక్తి కాదని, 2, 3 రోజులుగా అన్నవరం కొండకు విచ్చేసిన భక్తులను యాచిస్తున్నట్లు గమనించినట్లు ప్రైవేటు సెక్యూరిటీ వారు తెలిపారు. మృతదేహాన్ని హుటాహుటిన కిందకు తరలించి అన్నవరం కొండపై పండితులు సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు.



రత్నగిరి పార్కింగ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రకృతి సోయగాలు..

పూల రాఖీలు









- కడియం నర్సరీల్లో రాఖీపుష్పాల కనువిందు

కడియం, ఆగస్టు 18: దేశవ్యాప్తంగా పేరు గాంచిన కడియం నర్సరీల్లో ప్రకృతి సోయగాల పూల రాఖీలు కనువిందు చేస్తున్నాయి. సోదరప్రేమను ప్రదర్శించే ఆత్మీయ శుభతరుణం రక్షాబంధన్ (రాఖీ పండుగ). ఈ పండుగ రోజు రక్షాబంధనాలు కట్టుకుని సోదరులు విలువైన కానుకలు ఇచ్చి సోదరీమణులపట్ల ఆత్మీయతను చూపిస్తారు. ఇటీవల పుట్టినరోజు, వివాహ వేడుకలకు బహుమతులు బదులు మొక్కలు ఇచ్చి పుచ్చుకునే సంప్రదాయం నడుస్తోంది. అచ్చంగా రాఖీల్లా గే కనిపించే పూలమొక్కలు రక్షాబంధన్ వేళ కానుకలు అవుతున్నాయి. ఫ్యాసీఫ్లోరా శాస్త్రీయ నామంతో పిలిచే ఈ రాఖీపుష్పాలు విభిన్న పరిమళాల్లో, వివిధ ఆకృతులు, ఎరుపు, నీలం, తెలుపు తదితర విభిన్న రంగుల్లో విరబూ స్తూ నర్సరీల్లో కనువిం దు చేస్తున్నాయి. చక్కని పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ సన్నని రేకులు ఉంటూ అందంగా కనిపించే ఈ రాఖీపుష్పాన్ని కౌరవులు-పాండవులు పుష్పమని కూడా పిలుస్తుంటారు.

బెహ్రాయిన్‌లో మామిడికుదురు యువకుడి ఆత్మహత్య

- ఉపాధి నిమిత్తం నెల క్రితమే విదేశానికి వెళ్లాడంటున్న కుటుంబసభ్యులు
- మృతిపై విచారణ జరపాలని డిమాండ్
- మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని వేడుకోలు



దుర్గానాగసాయి(ఫైల్)

మామిడికుదురు, ఆగస్టు 18: నెల రోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం బెహ్రాయిన్ వెళ్లిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అసలు అక్కడ ఏం జరిగిందో కుటుంబీకులకు తెలియదు. కానీ ఉరి వేసుకుని చనిపోయాడనే సమాచారం రావడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన దుర్గానాగసాయి ఈనెల 22న ఇంటినుంచి బయలుదేరి 29వతేదీ నాటికి బెహ్రాయిన్ చేరుకున్నాడని అతడి మేనమామ ఉండపల్లి రమేష్ అలియాస్ శ్రీను ఆదివారం తెలిపాడు. అక్కడ పెట్రోలు బంకులో పనిచేస్తూ తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడని, ఏవిధమైన సమస్యలు ఉన్నట్టు తనతో చెప్పలేదని పేర్కొన్నాడు. చనిపోయే ముందు రెండు రోజులక్రితం కూడా ఫోన్‌లో మాట్లాడాడన్నారు. అతడితోపాటు కేరళకు చెందిన యువకుడు ఒకే గదిలో ఉంటున్నారని, తన మేనల్లుడి మృతిపై విచారణ జరిపించాలని, మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు సహకరించాలని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌తోపాటు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరానని తెలిపాడు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

సామర్లకోట, ఆగస్టు 18: సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి సామర్లకోట-పిఠాపురం రైల్వే ట్రాక్ మధ్య 60ఏళ్ల వయస్సు గల వృద్ధుడు వేగంగా వెళుతున్న రైలు కింద పడి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సామర్లకోట రైల్వేపోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు. ఘోరక్‌పూర్-అసన్‌సోల్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ సామర్లకోట రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జీకేఎస్ శ్రీదేవికి అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. మృతదేహానికి తెల్లటి చొక్కాపైన నల్లటి చుక్కలు, నీలం రంగుపై నలుపు గీతల లుంగీ, నీలం రంగుపై తెలుపు గీతలు గల టవల్, తెలుపు రంగు చెప్పులు, కుడితొడపై పుట్టుమచ్చలు కలిగి ఉన్నాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు.

మత్స్యకారుల వలకు చిక్కిన భారీ చేప

- అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో లభ్యమైన టేకి చేప



అంతర్వేది పల్లిపాలెం మినీఫిషింగ్ హార్బరులో బోటునుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో తెస్తున్న టేకి చేప

అంతర్వేది, ఆగస్టు 18: అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల వలకు భారీ టేకి చేప చిక్కింది. దీన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో బోటునుంచి వెలికి తీశారు. పశ్చిమగోదావరి జిల్లా వేములదీవికి చెందిన బలగం వెంకటేశ్వర్లు చేపల బోటుపై కాకినాడ మత్స్యకారులకు ఈ టేకి చేప వలకు చిక్కింది. అంతర్వేది సముద్రంలో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులకు దొరికిన ఈ భారీ చేపను అతికష్టంపై బోటుసాయంతో హార్బరు వద్దకు తీసుకువచ్చారు. 30మంది జాలర్లు తాళ్లతో పైకి లాగినా రాకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో హార్బర్ ప్లాట్‌ఫామ్‌కు తీసుకువచ్చారు. అంతర్వేదిలో తక్కువ ధర పలకడంతో కాకినాడ కుంభాభిషేకం రేవుకు వ్యానుపై తీసుకువెళ్తామని మత్స్యకారులు తెలిపారు. వెయ్యి కిలోల పైబడి ఉండే ఈ భారీ టేకిచేపలు అరుదుగా వస్తాయని, వీటిని ముక్కలు కోసి ఉప్పు చేపగా అమ్ముతారని తెలిపారు.



అయినవిల్లి విఘ్నేశ్వరుడికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఆగస్టు 18: ముమ్మిడివరానికి చెందిన ముళ్లపూడి గణేష్ కుటుంబసభ్యులు ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద్ ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు. అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

లోవలో భక్తుల కోలాహలం

- కిక్కిరిసిన క్యూలైన్‌లు
- ఆలయానికి రూ.3.76లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, ఆగస్టు 18: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలలనుంచి వేలాదిగా వచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువ జామున ఆలయ పండితులు ప్రత్యేక పూజల తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించడంతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులు వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో కె.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు చేశారు. అమ్మవారిని 20వేలమంది పైబడి భక్తులు దర్శించుకోగా దేవస్థానంలో వివిధ విభాగాల ద్వారా రూ.3.76లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

లారీలో గంజాయి రవాణా



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

- హైవేపై తనిఖీల్లో భాగంగా రాజానగరంలో పట్టుకున్న పోలీసులు
- 100 కిలోలు గంజాయి, ఒక లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

రాజానగరం, ఆగస్టు 18: విశాఖ ఏజెన్సీ నుంచి తమిళనాడుకు గుట్టు చప్పుడు కాకుండా లారీలో తరలిస్తున్న రూ.5లక్షల విలువైన 100 కిలోల గంజాయిని రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ కలిసి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా వజపడి మండలం వెప్పిలైపట్టిపుదుర గ్రామానికి చెందిన మరిముత్తు ఆరుముగమ్, పెరంబుదూరు జిల్లా సిరుమతూర్ మండలం కుదిక్కడు గ్రామానికి చెందిన వేల్ మురుగన్ కలిసి విశాఖ ఏజెన్సీనుంచి తమిళనాడుకు 100 కిలోల గంజాయిని బస్తాలతో లారీలో తరలిస్తున్నారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మనోహర్ తమ సిబ్బందితో కలిసి ఆదివారం జాతీయ రహదారిపై రాజానగరం హైస్కూల్ జంక్షన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా వీరు గంజాయితో పట్టుబడినట్టు తెలిపారు. విశాఖ ఏజెన్సీలో గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలోని సేలం నగరానికి తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకునేలా వ్యాపారం నిమిత్తం రవాణా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. వీరిలో వేల్ మురుగన్‌పై తిరుచ్చి పోలీస్‌స్టేషన్‌లో గతంలో గంజాయి కేసు నమోదైనట్టు డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు. నిందితులతోపాటు రూ.5లక్షల విలువైన గంజాయి, లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

ఏడాదిలో రూ.25లక్షల విలువైన గంజాయి స్వాధీనం

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాదికాలంగా ఏడు గంజాయి కేసులు నమోదు కాగా రూ.25 లక్షలు విలువైన 506.35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 22మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ వివరించారు. ఈ కేసులకు సంబంధించి రెండు లారీలు, ఒక వ్యాన్, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి తాగడం, రవాణా, వ్యాపార కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ మనోహర్, హెచ్‌సీ నాగేంద్ర, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి



ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో సత్తి సూర్యనారాయణరెడ్డి, గౌతమ్‌రెడ్డి తదితరులు

- గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 18: ప్రజలు కిడ్నీ వ్యాధులపై ముందస్తు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు వైద్యప్రముఖులు ఆస్పత్రిలోని ఐసీయూ, లేబోరేటరీ, ఇన్ పేషెంట్, ఆపరేషన్ థియేటర్ తదితర విభాగాలను ప్రారంభించారు. డాక్టర్ గౌతమ్ రెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జీవనశైలి మార్చుకోవడం ద్వారా కిడ్నీ, యూరాలజీ సంబంధిత వ్యాధులను నివారించవచ్చన్నారు. రాజమహేంద్రవరంలో అత్యున్నత ప్రమాణాలతో రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య సంస్థల చైర్మన్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ వీర్రాజు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి వెండి ఆభరణాల బహూకరణ



మామిడికుదురు, ఆగస్టు18: మామిడికుదురు మండలం మొగలికుదురులో శ్రీరుక్మిణిసత్యభామ సమేతవేణుగోపాలస్వామికి గ్రామానికి చెందిన దండు భీమరాజు-విజయలక్ష్మి దంపతులు రూ.1.50లక్షల విలువైన వెండితో చేసిన వక్షస్థలం, శంఖు, చక్రాలను బహూకరించారు. ఆలయఅర్చకులు వెండి ఆభరణాలను సంప్రోక్షణ చేసి స్వామికి అలంకరించారు.

పొలంలో గుళికలు చల్లుతుండగా అస్వస్థత



కూలీలను 108 అంబులెన్స్‌లో అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

- 8మంది కూలీలు ఆస్పత్రికి తరలింపు
- బిక్కవోలు మండలం పందలపాకలో ఘటన
- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి పరామర్శ

అనపర్తి, ఆగస్టు 18: బిక్కవోలు మండలం పందలపాకలో వరిపొలంలో గుళికలు చల్లుతూ 8మంది వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌ల సహాయంతో అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యసిబ్బంది తెలిపారు.

బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన రైతు శ్రీధర్ నారాయణరెడ్డి తన 15 ఎకరాల వరి పొలంలో గుళికలు చల్లేందుకు పందలపాక, ఊలపల్లి, మాచవరం గ్రామాలకు చెందిన 9మంది కూలీలను నియమించుకున్నారు. వీరు 9ఎకరాల్లో గుళికలు చల్లి కొంతసేపు సేదతీరారు. అంతలో మరో కూలీ తెచ్చిన మజ్జిగను తాగి తిరిగి పనికి ఉపక్రమించారు. కొద్దిసేపటికే పందలపాకకు చెందిన టి.విజయ్‌కుమార్, సీహెచ్ దుర్గారావు, పి.రాంబాబు, వై.వినోద్‌కుమార్, మాచవరం గ్రామానికి చెందిన విజ్జన శ్రీను, పలివెల యాకోబు, తాతపూడి గోవిందు, ఊపల్లికి చెందిన ఆర్.వెంకటరమణలకు కళ్లు తిరుగుతూ ఊపిరి తీసుకోవడం కష్టమైంది. దీంతో యజమాని 108కి సమాచారం అందించాడు. దీంతో అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించి అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు సేవలు ప్రారంభించడంతో ప్రాణాపాయంనుంచి బయటపడ్డారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు తదితరులున్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మోతుగూడెంలో జ్వరాలు

మంచాన పడుతున్న జనం

పలువురికి మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణ



చికిత్స పొందుతున్న బాధితులు

మోతుగూడెం, ఆగస్టు 18: ఇటీవల కురిసిన వర్షాలతో పాటు ఏజెన్సీలో వరదలు వచ్చిన నేపథ్యంలో వైరల్ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితుల్లో ఎక్కువగా జలుబు, విరోచనాలు, దగ్గు, ఒళ్లు నొప్పులు, అలర్జీ, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో మెకానిక్ సెక్షన్‌లో ప్లాంట్ అటెండర్‌గా బి.శాంతికి డెంగ్యూ నిర్ధారణ అయింది. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో శాంతిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ఆమె ఐదు రోజులు పాటు చికిత్సపొంది మృతి చెందింది. విష జ్వరాలు ఒక్కసారిగా విజృంభించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో దోమలు విపరీతంగా పెరగంతో సీలేరు కాంపెక్స్ చీఫ్ ఇంజనీర్ ఎం.వాసుదేవరావు ఆదేశాల మేరకు కార్మికులు కాలనీ, జల విద్యుత్ కేంద్రం వద్ద దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేస్తున్నారు.

ఎటపాక సబ్‌కలెక్టర్‌గా అపూర్వ భరత్



ఎటపాక, చింతూరు 18: ఎటపాక సబ్‌కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవోగా అపూర్వ భరత్ (ఐఏఎస్) నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలో పలువురి ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా పని చేస్తున్న అపూర్వ భరత్ ఎటపాక సబ్‌కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అయితే ఇప్పటి వరకు చింతూరు ఐటీడీఏ పీవోగా పనిచేసిన కావూరి చైతన్యకు ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు.

'గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి'

రంపచోడవరం, ఆగస్టు 18: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ, వార్డు వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఎం.వాణిశ్రీ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామ, వార్డు వలంటీర్లకు రూ.10 వేలు వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలల కావస్తున్న వలంటీర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గ్రామ వలంటీర్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న విజయవాడలోని ఎం.బి.భవన్‌లో జరిగే రాష్ట్ర వలంటీర్ల సదస్సును విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

సిరిగిందలపాడులో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఆగస్టు 18: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో 160 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో 61 మందికి రక్త, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఫిజియోథెరపీ, ఆరుగురికి ఎక్స్‌రే చేసినట్లు తెలిపారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్నవారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు టి.వి.సుబ్బారావు, దాసరి ఉమామహేష్, ఎస్.సంపత్‌కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు బి.ఆర్.ఎస్.శ్రీకాంత్, దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు.

చాలా శక్తివంతమైనది ఫొటో

ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి కందుల దుర్గేష్



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 18: ఫొటో చాలా శక్తివంతమైనదని.. ఆనందమైనా.. బాధయినా ఫొటో ఉండాల్సిందేనని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా రాజమండ్రి గోదావరి గట్టున ఉన్న మల్లిగ సత్రంలో గోదావరి వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక్క ఫొటో వంద భావాలను పలికిస్తుందని.. ఒక్క ఫొటో ఎంత పెద్ద విషాదన్నయినా కళ్లకు కట్టినట్టు చూపిస్తుందన్నారు. సోమవారం ఫొటో ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. డాక్టర్ రవీంద్ర డ్రోన్ కెమెరాతో తీసిన అద్భుత ఛాయాచిత్రాలు ఎంతో రమణీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ ద్రోణంరాజు భగవాన్ రాజు,ఆర్ఎస్ న్యూరో హాస్పిటల్ అధినేత డాక్టర్ రవీంద్ర కాపుప్రసాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వజ్రాల నాగేంద్రప్రసాద్, వంశీకృష్ణ, ఓఎన్‌జీసీ సంతోష్‌కుమార్, ఎఫ్‌సీఐ మేనేజర్ సీఎస్ఎన్ మూర్తి, ఓఎన్‌జీసీ నరేంద్ర,చంద్రదాస్ దేశవిదేశాల్లో తీసిన ఛాయాచిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

మానవత కార్యవర్గ ప్రమాణస్వీకారం

రాజమహేంద్రవం సిటీ, ఆగస్టు 18: మానవత సంస్థ సేవా కార్యక్రమాలను రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు అందించేందుకు మరింత విస్తృత చర్యలు చేపడుతున్నట్టు సంస్థ నూతన అధ్యక్షుడు పాలకృష్ణ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. నగరంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం 2024-25కి సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షుడుగా పాలకృష్ణ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రొంగల బాబూరావు, సెక్రటరీగా యూవీఎస్ సత్యనారాయణ(ఉప్పల శ్రీను), జాయింట్ సెక్రటరీగా బొదిరెడ్డి అప్పారావు, కోశాధికారిగా దాసరి సాయిబాబా, ఈసీ సభ్యులుగా హెల్త్‌విభాగం కన్వీనర్ డాక్టర్ కొమ్మశ్రీనివాస్, అవేర్‌నెస్ విభాగం కన్వీనర్ జి.విజయకిరణ్, ఎడ్యుకేషన్ కన్వీనర్‌గా యు.శ్రీరామ్మూర్తి, ఎమెర్జెన్సీ విభాగం కన్వీనర్‌గా తుమ్మూరవి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ వి.చంద్రయ్య, సంస్థ కన్వీనర్ బీఎస్ఎన్.మూర్తి, కోఛైర్మన్ మద్దుల మురళీకృష్ణ, బూర్లగడ్డ మురళీ, ఎంవీ.ధర్మారెడ్డి, న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు దారపు నాగిరెడ్డి పాల్గొన్నారు.

కోలమూరులో 750 మొక్కలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 18: అమ్మఒడి సేవా తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం కోలమూరులో 750 మొక్కలు నాటారు. ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ విభాగం, చేతనా ప్రకృతి సేవా సంస్థ సహకారంతో మొక్కలు నాటామని సేవా తరంగిణి అధ్యక్షుడు విజయస్వామి తెలిపారు.ఈ మేరకు జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అభినందించారన్నారు. కార్యక్రమంలో సభ్యులు కె.నాగవెంకటధనలక్ష్మి, బి.నాగమణి, ఐవీవీ సత్యనారాయణ, లోకేష్, దొరబాబు, కె.దుర్గాభవాని, సాయిభరద్వాజ్, మణికంఠ పాల్గొన్నారు.

23న అంత్యానుప్రాస నిఘంటువు ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు18: తెలుగులో 50 వేల పదాలతో ఒక సంకలనంగా తీర్చిదిద్దిన మొట్టమొదటి అంత్యానుప్రాస నిఘంటువును ఈ నెల 23వ తేదీన ఆవిష్కరించనున్నారు. రాజమండ్రి ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సెలర్ డాక్టర్ వై.శ్రీనివాస్ ఆవిష్కరిస్తారని రాఘవరావు తెలిపారు. వైఎన్ కళాశాల తెలుగు శాఖాధిపతిగా సేవలందించిన ఆరిపిరాల నారాయణరావు ఆరేళ్లు శ్రమించి ఆదునిక కవుల కలాల నుంచి జాలువారిన అంత్యానుప్రాస పదాలతో నిఘంటువును తయారుచేశారన్నారు.

మనకెందుకు!

- చెట్ల కొమ్మలు తొలగింపులో శాఖల మధ్య సమన్వయ లోపం
- క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బంది
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజానీకం



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోనే వదిలివేసిన రావి చెట్టు దుంగలు

కొవ్వూరు, ఆగస్టు 18: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో నరికివేసిన చెట్టు కొమ్మల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వశాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉన్న దేవతావృక్షం(రావిచెట్టు) కొమ్మ విరిగిపడింది. దానిని తొలగించవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆ పనిని ప్రైవేటు వ్యక్తులకు నోటిమాటగా తెలిపారు. వారేమో విరిగిన కొమ్మ తొలగింపు పేరుతో చెట్టును దాదాపు 70% నరికివేస్తుండగా బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ అడ్డుకుని మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్‌లకు ఫిర్యాదుచేశారు. కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా గోష్పాదక్షేత్రం తమ పరిధిలోది కాదని మున్సిపల్ అధికారులు బదులివ్వడంతో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లకు ఫిర్యాదుచేశారు. ఈ నెల 7న కొవ్వూరు మండలం కుమారదేవం గోదావరి ఒడ్డున నెలకొరిగిన సినిమాచెట్టును పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి దృష్టికి గోష్పాదక్షేత్రం ఘటనను మీడియా ప్రతినిధులు తీసుకురాగా ఆమె స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌కు సూచించారు. దీంతో సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, అటవీశాఖ అధికారులు, రోటరీక్లబ్ ప్రతినిధులు గోష్పాదక్షేత్రానికి విచ్చేసి రావిచెట్టును పరిశీలించారు. అనుమతుల్లేకుండా ప్రభుత్వ స్థలంలో దేవతావృక్షాన్ని నరికివేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదుచేసి కేసునమోదు చేయించాలని ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు, పట్టణ సీఐలను ఆదేశించారు. క్షేత్రంలో చెట్టు కొమ్మలను నరివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో సైదారాణి పోలీసులకు ఫిర్యాదుచేశారు.



అయితే సబ్ కలెక్టర్ ఆదేశించి 11 రోజులు పూర్తి కావస్తున్నా నరికివేసిన చెట్టు కొమ్మలను రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు తమకు సంబంధం లేదంటూ అలాగే వదిలివేశారు. ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో తాము ఎలాగూ బదిలీపై వెళ్లిపోతాం ఈ సమయంలో ఇదంతా మనకు అవసరమా అంటూ అధికారులు ఎవరు ఏమి చెప్పినా తమకు ఏదీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దేవతా వృక్షం చెట్టుకొమ్మలు యాగాలు, హోమాలలో వాడుతుంటారు. సుమారు ట్రాక్టరు లోడ్ అయ్యే చెట్టుకొమ్మలను అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేయడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి తక్షణం క్షేత్రంలో ఉన్న చెట్టుకొమ్మలను తొలగించి, నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాతేరులోని గణపతినగర్‌లో రోడ్డుపై వదిలేసిన చెట్టుకొమ్మల చెత్త

కాతేరులో ట్రాన్స్‌కో సిబ్బంది

నరికిన కొమ్మలు అలాగే వదిలేశారు..

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 18: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో పంచాయతీ పారిశుధ్య విభాగం వారి తీరు దారుణంగా వుంది. ఎన్నిసార్లు కథనాలు రాసినా, ప్రజల నుంచి అనేక సార్లు ఫిర్యాదులు వస్తున్నా సిబ్బంది తీరులో మార్పు రావడంలేదు. వారం రోజుల క్రితం గ్రామంలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది నరివేయించారు. వాటిని రోడ్డు పక్కన అలానే వదిలేశారు. అయితే వాటిని తొలగించాల్సిన పంచాయతీ పారిశుధ్య విభాగం వారు నిర్లక్ష్యంగా వదిలేసారు. ఎవరికి వారు మాకు సంబంధంలేదన్నట్టుగా వదిలేయడంతో ఆ కొమ్మలు చెత్తగా మారి రోడ్డుపైకి చేరి వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారాయి. కాతేరు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఇన్‌చార్జీలు సైతం ఆ చెత్తను చూసుకుంటూ వెళుతున్నారే తప్ప వాటిని డంప్ చేసే ప్రయత్నం చేయడంలేదు. చెత్త తరలించే ట్రాక్టర్లు కూడా వెళుతున్నాయి. కాని వాటిని తరలించడం లేదు. అసలే జ్వరాల సీజన్ కావడంతో ఇలాంటి చెత్తచెదారం పేరుకుపోయి ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. పంచాయతీ స్థాయిలో ఎలాగు పట్టించుకోవడం లేదు, కనీసం జిల్లా స్థాయి అధికారులైన స్పందిస్తే గ్రామంలో మెరుగైన పారిశుధ్యం సాధ్యమౌతుందని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో చెరువుగట్టు మలుపులోను, కొత్తగా కట్టిన చెరువుగట్టు వాకింగ్ ట్రాక్ గేటు వద్ద కూడా పెద్దఎత్తున చెత్త పేరుకుపోతోంది. జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేస్తే పరిస్థితి అర్థమౌతుందనే వాదన ప్రజల నుంచి వస్తోంది.

దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రామవరంలో దంత సమస్యల సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి ఆగస్టు 18: దంతాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనిషి ఆరోగ్య పరిస్థితులు బాగుంటాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజానగరం జీఎస్ఎల్ దంత వైద్య విభాగం ఆధ్వర్యంలో మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న ఇంటింటా దంత సమస్యల సర్వే కార్యక్రమాన్ని ఆదివారం రామవరంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దంత సమస్యలపై అశ్రద్ధ చేయవద్దని, మండలంలో నెల రోజుల పాటు నిర్వహించే దంత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనపర్తిలో రెండో దశ కార్యక్రమాన్ని స్థానిక రజక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన 40 దంత వైద్యులు సేవలందించారు. ఇదిలా ఉండగా అనపర్తిలోని జడ్పీ హైస్కూల్లో ఐటీసీ లిమిటెట్ ఐఎల్‌టీడీ డివిజన్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న ప్రహారి నిర్మాణ పనులకు విద్యాదాత డాక్టర్ పోతంశెట్టి జానకిరామారెడ్డితో కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి భూమిపూజ చేశారు. పంచాయతీ నుంచి నామమాత్రపు కంట్రిబ్యూషన్‌తో పాఠశాల అభివృద్ధికి ఐటీసీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమాల్లో సిరసపల్లి నాగేశ్వరరావు, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సర్పంచ్ వారా కుమారి, డాక్టర్ కర్రి సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కర్రి సాయివెంకటకృష్ణారెడ్డి, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే మహిళా ఉద్యోగి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామం నవభారతీ నగర్ 5వ వీధికి చెందిన కర్రి శాంతి సామ్రాజ్యం గత నెల 21నుంచి కనిపించడం లేదని బొమ్మూరు పోలీసులు తెలిపారు. శాంతి రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త హరిబాబు కూడా రైల్వే ఉద్యోగే. ఇద్దరు ప్రేమించి వివాహం చేసుకున్నారు. అయితే ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి కేసులు పెట్టుకున్నారు. వరకట్నం కేసు పెండింగ్‌లో వుంది. ఈ నేపథ్యంలో శాంతి తన పెద్దనాన్న వద్దే వుంటోంది. గత నెల 19వ తేదీ రాత్రి ఆమెను కుక్క కరిచింది. దీంతో పెద్దనాన్న కర్రి చిన్నబాబురావు ఆసుపత్రికి తీసుకువెళ్లి ఇంజక్షన్ చేయించాడు. మరలా గత నెల 23న ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. 21వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని అప్పటి నుంచి ఆమె కనిపించడంలేదని బాబురావు బొమ్మూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు చేయాలి

ఎస్సీఎస్టీ మైనార్టీ సంఘాల కొవ్వొతుల ర్యాలీ



అంబేద్కర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18 : కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం హత్య ఘటనకు నిరసనగా రాజమహేంద్రవరం అంబేద్కర్ సెంటర్‌లో ఎస్సీఎస్టీ మైనార్టీ సంఘాలు ఆదివారం రాత్రి కొవ్వొతుల ర్యాలీ చేశాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు తేవాలని కోరారు. కార్యక్రమంలో కోరుకొండ చిరంజీవి, తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, కప్పల వెలుగుకుమారి, మోతా నాగలక్ష్మి, ఖండవల్లి లక్ష్మి, గొట్టిముక్కల అనంతరావు, ఆదిలక్ష్మి, తాళ్ళూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువకు గండి.. నీటమునిగిన నర్సరీలు

లక్షల్లో ఆస్తినష్టం.. రైతుల గగ్గోలు



కాలువకు గండి పడి నీట మునిగిన నర్సరీలు

కడియం ఆగస్టు 18 : మండలంలో తూర్పు డెల్టాకాలువకు నీరు పోటెత్తి నర్సరీలను ముంచెత్తింది. కడియం, కడియపులంక, పొట్టిలంక గ్రామాల్లో నర్సరీలను ఆనుకుని ఉన్న పెద్దకాలువ గట్టుకు ఆదివారం గండిపడింది. దీంతో నర్సరీల్లో తోటలు నీట మునిగిపోయాయి. 40 ఏళ్లుగా తూర్పు డెల్టాకాలువకు ఇటువంటి పరిస్థితిలేదు. కడియపులంకకు చెందిన రైతు బాదం పెదకాపు అరెకరం పొలంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నిమ్మమొక్కల అంట్లు కూడా నీట మునిగాయి. సుమారు రూ.10 లక్షలు నష్టవాటిల్లిందని రైతు వాపోయాడు. ఇండోర్ ప్లాంట్స్, అరటి, దొండ పంటలకు నష్టం జరిగింది. అధికారుల నిర్లక్ష్యం వల్లనే కాలువకు గండిపడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువెళ్లారు.

ఇంటింటా కుళాయి సర్వే త్వరగా పూర్తి చేయాలి

కమిషనర్ కేతన్ గార్గ్.. సర్వే, పార్కు స్థలం పరిశీలన



ఇంటింటా సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన కుళాయి ఉన్న ఇళ్ల సర్వేను త్వరగా పూర్తిచేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. రాజమహేంద్రవరం నారాయణపురంలో నిర్మించిన స్క్వాష్ కోర్టును, ఇంటింటా కుళాయి సర్వేను, ఆవరోడ్డులో నిర్మించ తలపెట్టిన సిటీ లెవెల్ పార్కు స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు చేస్తున్న సర్వేను చూసి పలు సూచనలు చేశామన్నారు. గతంలో ఆమోదించబడిన ప్లాన్లు ప్రకారం నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. క్రీడాకారులు ఏనాటి నుంచో ఎదురుచూస్తున్న స్క్వాష్ కోర్టు నిర్మాణపనులు చివరి దశలో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. క్రికెట్ స్టేడియం పనులు త్వరలో ప్రారంభించాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ జి.పాండురంగారావు, ఈఈ మదర్షాఅలీ, పి.ప్రసాద్, డీఈఈ సం దీప్, అసిస్టెంటు ఇంజనీరు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రులకు రాట మంచి



రాజమహేంద్రవరంలో రాట మహూర్తంలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు ఆగస్టు 18: మండలంలోని కొంకుదురులో మార్కెట్ సెంటర్‌లో వచ్చే నెల 7వ తేదీ నుంచి జరగబోయే గణపతి నవ రాత్రి ఉత్సవా లకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన గొలుగూరి రామచంద్రారెడ్డి పావని దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించి రాట మంచి కార్యక్రమం నిర్వహిం చారు. పూజా కార్యక్రమాల్లో కమిటీ ప్రతినిధులు చిన్నం వీరభద్రారెడ్డి, కర్రి రామారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, మల్లిడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: నాళం భీమరాజు వీధిలోని శ్రీ సిద్ధి లక్ష్మీ వినాయకుడి చవితి ఉత్సవాలకు రాటముహూర్తం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు శెట్టి జగదీష్ మద్ది నారాయణరావు, నల్లం ఆనంద్, బి.నారాయణరావు, డాల్లా మురళి, కొత్త రాజేష్ పాల్గొన్నారు.

నగరంలో గ్యాస్ సిలెండర్ల దొంగలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18: రాజమహేంద్రవరంలో లలితానగర్, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. కొంత మంది గుర్తుతెలియని యువకులు బైక్‌లపై వీధుల వెంబడి రెక్కీ నిర్వహించి అలికిడి లేని ఇళ్ళలోకి ప్రవేశించి గ్యాస్ సిలిండర్లు, సైకిళ్లు, కుర్చీలు వంటి వాటిని పట్టుకుపోతున్నారు. పోతున్నవి చిన్నపాటి వస్తువులు కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేయడంలేదు. కానీ ఇలాగే వదిలేస్తే రేపు ఇళ్లు లూటీ కావడం ఖాయమనే విమర్శలు కొంత మంది నుంచి వ్యక్తమవుతున్నాయి. నగరంలోని ఒక ఇంటిలో ఈనెల 14వ తేదీన గ్యాస్ సిలిండర్‌ను దొంగిలించుకుపోయారు. కానీ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఇటువంటి సమస్యలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లకపోతే చిల్లర దొంగతనాలు పెద్దవిగామారే ప్రమాదం ఉంది తస్మాత్ జాగ్రత్త.

నల్లజర్ల ఎస్ఐగా శ్రీహరిబాబు

నల్లజర్ల, ఆగస్టు 18: నల్లజర్ల ఎస్ఐగా శ్రీహరిబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నిన్నటి వరకు ఇక్కడ పనిచేసిన టీవీ రమేష్ బదిలీపై నరసాపురం వెళ్లగా తాడేపల్లిగూడెం రైల్వేలో పనిచేస్తున్న శ్రీహరిబాబు నల్లజర్ల విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

డిగ్రీ, పాలిటెక్నికల్ కాలేజీలు ఏర్పాటు.. ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఆగస్టు 18: రాజానగరం నియోజకవర్గంలో విద్య, వైద్యం, సాగునీరుకు అధిక ప్రాధాన్యం ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నట్టు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చెప్పారు. ఆదివారం కోరుకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని, అలాగే నియోజకవర్గంలో జూనియర్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేస్తామని, న్నారు. ఇందుకోసం అవసరమైన భవనాలను అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు. చదువుకోవాలనుకునే పిల్లలకు కళాశాలలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దృష్టికి వీటి అవసరాలను తీసుకెళ్లామన్నారు. అలాగే ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలన్నది తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బదిరెడ్డి దొర, చలగంశెట్టి శివరామకృష్ణ, యర్రంశెట్టిపోలారావు, దేవన దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీతానగరం, ఆగస్టు 18:బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సీతానగరంలో ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని, అందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పువ్వాడ కృష్ణ, ఖండవల్లి సాయి, కాణపాల మాతాజీ, అభిలాష, గుల్లి సుబ్బయ్య, బుల్లి, సుధాకర్, డేరా నాగరాజు పాల్గొన్నారు.

భారతీయులపై దాడులకు నిరసనగా రేపు శాంతి ర్యాలీ

గోకవరం, ఆగస్టు 18: బంగ్లాదేశ్‌లో భారతీయులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 20న గోకవరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమయ్యే ఈ ర్యాలీ తంటికొండ రోడ్డులోని సీఎండీ కేఎస్‌పీ లేఅవుట్ నుంచి గోకవరం గ్రామ శివారున శివాలయం వరకు జగుతుందన్నారు. కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొనాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

40 లీటర్ల సారా స్వాధీనం

గోకవరం, ఆగస్టు 18: మండలంలోని కామరాజుపేట గ్రామ శివారులో 40లీటర్ల బెల్లపు ఊటను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. అలాగే సుమారు 300 లీటర్ల బెల్లపు ఊటను కూడా గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: డబుల్ ఇస్మార్ట్
సూర్యామినీ	: తంగలాన్
సూర్యాప్యాలస్	: డబుల్ ఇస్మార్ట్
స్వామి	: మిస్టర్ బచ్చన్
శివజ్యోతి	: మిస్టర్ బచ్చన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: కమిటీ కుర్రోళ్లు
రాజా	: మిస్టర్ బచ్చన్
ఊర్వశి	: డబుల్ ఇస్మార్ట్
రంభ	: తంగలాన్
మేనక	: స్త్రీ-2, వేదా
అప్సర	: మిస్టర్ బచ్చన్
కుమారి	: డబుల్ ఇస్మార్ట్
అశోక	: ఆయ్
వీఎస్ మహల్(నామవరం)	: డబుల్ ఇస్మార్ట్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: డబుల్ ఇస్మార్ట్
వెంకటసూర్య(కడియం)	: డబుల్ ఇస్మార్ట్
సత్యగౌరి (అనపర్తి)	: ---
సూర్యశ్రీ (అనపర్తి)	: ---
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ---
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: ---
శ్రీనివాస (గోకవరం)	: ---
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహల్(రంపచోడవరం)	: ---
నవయుగ(చింతూరు)	: -----

ప్రకృతి రాఖీ



రాజుకున్న.. 'పోలవరం' మంటలు!



పోలవరం ఫైల్స్ దగ్ధంపై నిప్పు రాజుకుంది.. ఇటు ఉన్నతాధికారులు.. అటు పాలకల్లోనూ మంటలు రేపింది. పోలవరం అక్రమాలు బయటకు రాకూడదనే ధవళేశ్వరంలోని పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లకు నిప్పు పెట్టారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. ధవళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇదిలా ఉండగా కార్యాలయాన్ని ఆదివారం మంత్రి దుర్గేష్ సందర్శించి మండిపడ్డారు. మీ ఇంట్లో చెత్తను తగలబెట్టినట్టు ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్‌ను ఎలా తగలబెడతారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమగ్ర విచారణ జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. - వివరాలు మెయిన్‌లో

ఓ అన్నా నీ అనురాగం..

రక్షా బంధన్.. పేరులోనే ఉంది రక్ష అని..
ప్రతి సోదరిసోదరుడు ఎదురుచూసే రోజు ఇది..
కాలంతో పాటే పరుగెడుతున్నా.. ఆ పరుగులో బంధాలు..
బంధుత్వాలకు సమయం కేటాయిస్తున్నారు.. నేటికీ విలువ
ఇస్తున్నారు.. ఈ రోజు కోసం ఏడాదంతా ఎదురుచూసే
వారెందరో.. ఓ అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల
పుణ్యఫలం అంటూ సోదరి వచ్చే ఏడాదంతా రక్షణగా
ఉండాలని రాఖీ కడుతుంది..నీకు నేను రక్షగా ఉన్నానంటూ
అన్న ఆ రాఖీ కట్టించుకుంటాడు. ఇదే రక్షాబంధన్..
రాఖీ పండుగకు వయసుతో పనేముంది..
ఈ చిత్రంలోనే చూడండి.. నేడు రాఖీ పండుగ సందర్భంగా
రాజమహేంద్రవరంలోని ఒక దుకాణం వద్ద రాఖీల
కొనుగోలుకు అన్ని వయసుల మహిళలు ఎగబడ్డారు..
కడియం నర్సరీలలోనూ ప్రకృతి రాఖీలు కనువిందు
చేస్తున్నాయి. అందరినీ అలరిస్తున్నాయి.



డబ్బు కొట్టు.. పోస్ట్ పట్టు!

బదిలీల్లో 'రేటు' బాగోతం



- శాఖల వారీగా బదిలీలు
- నచ్చిన ప్లేస్‌కు ఒక రేటు
- డిమాండ్ ఉన్న స్థానానికో రేటు
- చందాలు అంటూ వసూళ్లు
- పోస్టులు కొంటున్న అధికారులు
- అన్ని విభాగాల్లోనూ ఇదే తీరు
- డిబ్బీలు తెరిచిన కూటమి నేతలు
- షాడో ఎమ్మెల్యేలదే పైచేయి
- ముఖ్య నేతలు దృష్టిపెట్టాల్సిందే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

డబ్బు కొట్టు.. కుర్చీ పట్టు.. ఏ సీటు కావాలంటే ఆ సీటు మీదే.. సీటుకో రేటు మరి.. అక్కడ ఉన్న డిమాండ్‌ను బట్టి రేటు మారుతోంది.. ఇలా అధికారుల బదిలీల్లో భారీగా డబ్బు చేతులు మారుతోంది. కొందరు ప్రజా ప్రతినిధులు పోలీస్, రెవెన్యూ,ఇతర శాఖల అధికారుల బదిలీల్లో రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. పోస్టును బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు సమాచారం.గత వైసీపీ పాలకుల అరాచకం,దోపిడీకి తట్టుకోలేక సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పాతరేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత కూటమి నాయకులు అదే దారిలో పయనిస్తుండడంపై ముక్కున వేలేసుకుంటున్నారు.. ఒక్క పక్కన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై బిజీ బిజీగా ఉంటున్నారు.అయితే జిల్లాలో కూటమికి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల వైఖరి మాత్రం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

పోస్టును బట్టి రేటు..

కొత్తప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులు, అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి,ఇష్టానుసారం చట్టాలకు తూట్లు పొడిచిన వారిని సాగనంపే పనిచేస్తున్నారు. దీనినెవరూ కాదనరు. కానీ కొందరు డబ్బే పరమావధిగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం కొనసాగితే ఎంత ప్రమాదమో ప్రజలు గ్రహించి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బకొట్టారు. దీని నుంచి గెలిచిన నేతలు చాలా పాఠం నేర్చుకోవాలి. అయితే పాఠం సంగతి అటుంచి వైసీపీ నేతలు ఏ దారిలో పయనించారో అదే దారిని ఎంచుకోవడం చర్చనీయాంశమవుతోంది. ఇటీవల తహశీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు తదితర ఉద్యోగుల బదిలీలు జరిగాయి. జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు ప్రతి బదిలీకి ఒక రేటు కట్టినట్టు సమాచారం. ఇటీవల సీఐల పోస్టింగ్‌లలో సర్కిల్‌ను బట్టి రేటు కట్టి అది ఇచ్చిన వారికే పోస్టింగ్ ఇచ్చినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఓ మాదిరి సర్కిల్ అయితే రూ. 15 లక్షలు..డిమాండ్ ఉండే సర్కిల్ అయితే రూ.25 లక్షలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఒక నియోజకవర్గంలో సీఐ పోస్టుకు రూ.20 లక్షల వరకూ వసూలు చేసినట్టు సమాచారం. తహశీల్దార్ పోస్టుల్లోనూ ఇదే తీరే నడిచిందని సమాచారం. ఒక నియోజకవర్గంలో ఒక తహశీల్దార్ పోస్టుకు రూ.16 లక్షల వరకూ డిమాండ్ చేసినట్టు సమాచారం.అయితే ఆ తహశీల్దార్ పోస్టు ఖాళీగానే ఉంది.పంచాయతీ రాజ్ శాఖలోనూ ఇదే విధంగా ఉంది. పోస్టును బట్టి రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో ఒక నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శి పోస్టుకు రూ.21 లక్షలు చెల్లించడానికి బేరం కుదిరినట్టు తెలిసింది.డబ్బు ఇస్తే చాలు గతంలో అతను వైసీపీకి అనుకూలంగా పనిచేశాడా.. నాయకులు,ప్రజలను ఇబ్బంది పెట్టాడా.. లేదా నేతలు చెప్పినట్టు చేశాడా అనే అంశాలు పట్టించుకోవడం లేదు.రేటు చెప్పి పోస్టులు అమ్ముకుంటున్నట్టు తెలిసింది.ప్రస్తుతం మేధావులు, అధికార వర్గాలు,రాజకీయ పార్టీల్లో ఇదే చర్చ జరుగుతోంది.

మీ చందా ఎంత?

ఎవరికీ అనుమానం రాకుండా నాయకులు కొత్త పంథా ఎంచుకున్నారు.దేవుడి పేరు చెప్పి పోస్టులు అమ్మకం పెడుతున్నారు. దేవుడి సంబరాలకు చందాలు వసూలు చేసే సమయం.. ఎక్కువ మొత్తంలో చందాలు లాగడానికి మీ ముందు దాత ఇంత ఇచ్చాడని ఎక్కువ ఇచ్చిన దాత వివరాలు చూపిస్తున్నారు. పోస్టు కోసం వచ్చిన అధికారికి అలా చూపిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అంటే అంతకంటే ఎక్కువ ఇస్తే పోస్టు ఖాయమని చెప్పడం దానర్థం అనమాట. గతంలో ఇదే జిల్లాలో వైసీపీ చెప్పినట్టు చేసిన అధికారులు పక్క పక్కనే పోస్టులు సంపాదించుకోవడం కూడా ఇటువంటి వాటిని ధ్రువీకరిస్తున్నాయి. ఇవన్నీ ఆయా ముఖ్య నేతలకు తెలిసే జరుగుతున్నాయా, వారి అనుచరులే బేరమాడి సెటిల్ చేస్తున్నారా అనే దానిపై స్పష్టత లేదు. ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉందో తెలి యదు కానీ కొందరు నేతలు మాత్రం చెడ్డపేరు తెచ్చుకుంటు న్నారు. ఇలా జిల్లాలో చాలా చోట్ల జరిగినట్టు తెలు స్తోంది. ఇంకా కొన్ని పోస్టులకు సిఫారసు లెటర్లు సిద్ధం చేయడం గమనార్హం. కొద్దిరోజుల్లో మరికొందరికి బదిలీలు ఉండే అవకాశం ఉంది. ఇలా చట్టా లను కాపాడవలసిన అధికారులు రూ.లక్షలు ఇచ్చి పోస్టింగ్‌లు తెచ్చుకుంటే ఇక వారి పనితీరు ఎలా ఉంటుందో ఊహించుకుంటూనే భయం కలుగుతుంది. పోస్టింగ్‌లలో రాజకీయ జోక్యం వల్ల చివ రకు డబ్బు ఇస్తేనే కానీ పోస్టింగ్ ఇవ్వని పరిస్థితి నెలకొంది.ఈ పరిస్థితి ఏ పరిణామాలకు దారి తీస్తుందోననే ఆందోళన అన్ని వర్గాల్లోనూ నెలకొంది.

నాయకులు మేల్కొనాల్సిందే

జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ప్రతి నియోజకవర్గంలోనూ షాడో ఎమ్మెల్యేలు ఉన్నట్టు సమాచారం.అంటే ఎమ్మెల్యేకు తెలియకుండానే పనులు చక్కబెట్టేస్తారన మాట. ఈ పోస్టుల అమ్మకం అంతా వారే చూస్తున్నట్టు సమాచారం.దీంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులైనా కాలేదు.. అప్పుడే అవినీతి మరకలు అంటుకున్నాయి.ఇకనైనా కూటమి ప్రధాన నాయకులు మేల్కొనాల్సిందే.ఆరంభంలోనే ప్రక్షాళనపై దృష్టి పెట్టాల్సిందే.ప్రజాప్రతినిధులు తమ షాడోలపై ఒక కన్నేసి ఉంచాల్సిందే. ఏం జరుగుతుందనే దానిపై నిరంతరం ఆరా ఉండాల్సిందే.. లేదంటే మరిన్ని ఆరోపణలు ఎదుర్కోవాల్సిందే.

వ్యాధుల నియంత్రణకు చర్యలు : డీఎంహెచ్‌వో

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గోకవరం, ఆగస్టు18: జిల్లాలో డెంగీ, మలేరియా, డయేరియాతో పాటు, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు చేపడుతున్నట్టు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం "అమ్మో జ్వరం" అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటా నిరంతర జ్వరపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. లార్వా నిరోధక చర్యలు,దోమల పిచికారీ మందు, దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్, తదితర చర్యలను ఎప్పటికప్పుడు చేపడుతున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షల సౌకర్యాలు లేవని, ప్రభుత్వ పరీక్షా కేంద్రంలోనే నిర్ధారణ సౌకర్యాలు ఉన్నాయన్నారు.రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మైక్రో బయాలజీ ల్యాబ్‌కు మాత్రమే మ్యాక్ ఎలిసా పరీక్ష నిర్వహించే సామర్థ్యం ఉంద న్నారు. జిల్లాలో మలేరియా 1, డెంగీ 21 కేసులు నమోదయ్యాయన్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులకు ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు ముగ్గురు టీచర్లు

రంగంపేట,ఆగస్టు 18 : జాతీయ స్థాయి వృత్యంతర శిక్షణకు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రంగంపేట జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు వి.రమ్యసుధ, హుకుంపేట, వెదుళ్ళపల్లి హైస్కూళ్ల నుంచి పి.లక్ష్మీఫణికుమార్, ఎస్.శ్రీనివాసులు హాజరవుతున్నారు. ఈ మేరకు రంగంపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి ఆదివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్ బాడ్లాన్‌లో సీసీఆర్‌టీ రీజినల్ వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.ఆ తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు.దీనిలో భాగంగా విద్యావిధానంపై అవగాహన కల్పించనున్నారు.జాతీయస్థాయి శిక్షణ తరగతులకు ఎంపికవడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ఐదుగురు ఎస్ఐల బదిలీ

వీఆర్‌కు రాజమహేంద్రవరం వన్‌టౌన్ ఎస్ఐ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 18 : తూర్పుగోదావరి జిల్లాలో ఐదుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ ఉత్తర్వుల మేరకు జిల్లాలో రాజమహేంద్రవరం డీఎస్‌బీలో ఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ఫణిమోహన్‌ను సీతానగరం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బదిలీ చేశారు. కొవ్వూరు స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జుబేర్ మహ్మద్‌ను రాజమహేంద్రవరం త్రీటౌన్‌కు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం డీఎస్‌బీ ఎస్ఐగా పనిచేస్తున్న సోమన శివప్రసాద్‌ను నగరంలోని ప్రకాష్‌నగర్ స్టేషన్‌కు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎండీ ఆసిఫాను వీఆర్‌లోకి పంపారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఐ జి.శ్రీహరిబాబును నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బదిలీ చేశారు.

రాజానగరంలో గంజాయి పట్టివేత 6

కార్పొరేషన్ ఎన్నికలెప్పుడో!

అందరి చూపు.. రాజమహేంద్రవరం వైపు



- ఐదేళ్లుగా ఎన్నికల్లేవ్
- భయంతో అడుగేయని వైసీపీ
- గత పాలకుల ఏకపక్ష నిర్ణయాలు
- పాలకమండలి లేక ఇష్టానుసారం
- వీడని విలీన గ్రామాల వివాదం
- 2027లో గోదావరి పుష్కరాలు
- కూటమి నిర్వహించాలని పట్టు
- ఇప్పటికే ఆశావహుల క్యూ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 17 : చారిత్రాత్మక రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వైపే అందరి దృష్టి మరలుతోంది. రాజకీయ చైతన్యం కలిగిన రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు పాలక మండలి ఎన్నికలు జరిగి ఐదేళ్లు గడిచిపోయాయి. అప్పటి నుంచి అధికారుల కనుసన్నల్లోనే పాలన సాగుతుంది. పాలకమండలి లేకపోవడంతో గత ప్రభుత్వంలో అనేక నిర్ణయాలు వైసీపీ ప్రజాప్రతినిధుల ఇష్టారాజ్యంగా మారాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించలేకపోయింది. దీనికి ప్రధాన కారణం ఓటమి భయం. ఎందుకంటే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ జయకేతనం ఎగురవేసింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు పెడితే టీడీపీ గెలుస్తుందని..వైసీపీ పనులకు చుక్కెదురవుతుందని వెనుకడుగువేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం, అటుపై ఆర్యాపురం బ్యాంక్ పాలక మండలి ఎన్నికల్లో కూడా కూటమి హవా కొనసాగడంతో ఇప్పుడు అందరి దృష్టి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థపై పడింది.

2002 నుంచి టీడీపీదే విజయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 2002కు పూర్వ పురపాలక సంఘంగా ఉండేది.. అప్పటి టీడీపీ ప్రభుత్వం నగరపాలక సంస్థగా మార్చుచేసింది. కార్పొరేషన్‌గా అవతరించాక మూడు సార్లు ఎన్నికలు జరగ్గా టీడీపీ అభ్యర్థులు చక్రవర్తి, ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, పంతం రజనీ శేషసాయి వరుసగా మేయర్లుగా ఉన్నారు. అయితే 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చి జగన్ సీఎం అయ్యాక కార్పొరేషన్ కు ఎన్నికలు జరపకుండా నిలుపుదల చేశారు. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు నగరపాలక సంస్థకు పాలక మండలి లేకుండా అధికారుల పాలనలో సాగుతుంది.

పుష్కరాలు వచ్చేస్తున్నాయి..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థగా అవతరించాక ఇప్పటికి రెండు పుష్కరాలు జరిగాయి. ఈ రెండు పుష్కరాలకు సీఎంగా చంద్రబాబు ఉన్నారు. నగరపాలక సంస్థకు పాలకమండలి లేకుండా ఈ వేడుక జరిగిన సందర్భాలు లేవు. అభివృద్ధి పనులపై ఇద్దరు శాసన సభ్యులు కోఆప్షన్ సభ్యులుగా నగరపాలక సంస్థ పాలక మండలి కలిసి సమన్వయంతో నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగేపరిస్థితులు ఉన్నాయి.2027లో రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలను నిర్వహిస్తున్నందున రాజమహేంద్రవరం పాలక మండలికి ఈ ఏడాది డిసెంబరులోనే ఎన్నికలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 50 డివిజన్లలో ఉన్న జనాభా 2011 లెక్కల ప్రకారం 3 లక్షల 14 వేల మంది ఉన్నారు.2021లో జనాభా లెక్కించాల్సి ఉండగా అదిజరగలేదు.ప్రస్తుతం సుమారు 4 లక్షల పైబడి జనాభా ఉంటారు.ఇంకా పాత లెక్కల ప్రకారమే పరిగణిస్తున్నారు. ఓటర్ల విషయానికి వస్తే మహిళలు 96 వేలు పైబడి, పురుషులు 80వేలు పైబడి ఉన్నారు.పదిగ్రామాలు విలీ నం చేస్తే సుమారు 5 లక్షల పైబడి జనాభా ఉంటారు.

పది గ్రామాల విలీనంపై సందిగ్ధం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో రూరల్ నియోజకవర్గం నుంచి 24 గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదన గతంలో టీడీపీ హయాంలో పెట్టిందే. అయితే వాటిని కొన్ని కేసులు, ఇతర గొడవల నేపథ్యంలో రూరల్‌లో వేమగిరి, ధవళేశ్వరం, బొమ్మూరు. హుక్కుంపేట,పిడింగొయ్యి, తొర్రేడు, కాతేరు, కోలమూరు, కొంతమూరు, లాలాచెరువు పది గ్రామాలకు కుదించారు. వాటికి గవర్నర్ రాజముద్ర కూడా పడింది. గత ప్రభుత్వంలో ఈ గ్రామాల విలీనానికి రైతులు ఒప్పుకోవడంలేదని సాకుగా చూపించి ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అప్పటి కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలతతో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేయించి డీఎంఏకు పంపారు. అక్కడ ఫైల్ పెండింగ్‌లో ఉంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం వైసీపీ పరాజయం చెందడం జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గత తీర్మానాన్ని రద్దుచేసి కోర్టు కేసులను పరిష్కరించుకుని వేగంగా విలీనం వైపు వెళుతుందా లేక వైసీపీ చేసిన తీర్మానం ప్రకారం విలీనం చేయకుండా కార్పొరేషన్ ఎన్నికలకు వెళుతుందా వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లలోనే ఈ పది గ్రామాలు కలిపే విధంగా వార్డుల పునర్విభజన జరిగింది.

ఇద్దరు ఎమ్మెల్యేల నిర్ణయాలే కీలకం





రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి ఇద్దరు ఎమ్మెల్యేలు కీలకం కాబోతున్నారు. పాలక మండలి ఏర్పడితే ఎక్స్‌అఫీషియో సభ్యులుగా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉంటారు. ఈ నేపథ్యంలో డిసెంబరులో ఎన్నికలకు వెళ్లాల్సివస్తే కూటమి ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యేలు ఇద్దరు సమన్వయంతో ముందుకుసాగి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. విలీన గ్రామాలు,ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక, అటుపై పుష్కరాల ప్లానింగ్‌లోను ఇద్దరు ఎమ్మెల్యేల పాత్ర కీలకం కాబోతుంది. మొత్తానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నిర్ణయం ప్రకారం నగరపాలక సంస్థకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్ని కలు ఎప్పుడు పెట్టినా ఎన్నికల రణరంగంలోకి దిగి విజయాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి నుంచి ముఖ్యనేతలు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి పోటీ చేసేందుకు టీడీపీ నుంచి ఇద్దరు నేతలు సిద్ధంగా ఉండగా జనసేన నుంచి ఉత్సాహవంతులు ఉన్నారు. 2027 పుష్కరాలు కీలకం కాబట్టి ఈ సారి కౌన్సిల్‌లో ఉంటే చరిత్రలో నిలిచిపోతామనే ఆలోచనలో నాయకులు ఆశతో ఉన్నారు.



కరుణించమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, ఆగస్టు 18 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,20,788లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్, చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



విక్టరీ సింబల్ చూపుతున్న జాంపేట అర్బన్ బ్యాంక్ పాలకమండలి సభ్యులు

జాంపేట బ్యాంక్ పాలకవర్గం ఏకగ్రీవం

- తొలిసారిగా 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నిక
- చైర్మన్‌గా బొమ్మన జయకుమార్.. నేడు అధికారిక ప్రకటన

రాజమహేంద్రవరం,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పోటీలో ఉన్న ఇతర సభ్యులంతా తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 12 మంది డైరెక్టర్లతో పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన వారి పేర్లను ఆయన ప్రకటించారు. జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నికల చరిత్రలో ఏకగ్రీవం కావడం ఇదే తొలిసారి. సోమవారం ఎన్నికైన సభ్యులంతా సమావేశమై చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. చైర్మన్‌గా ప్రస్తుత సిట్టింగ్ చైర్మన్ బొమ్మన జయకుమార్ తిరిగి ఎన్నిక కానున్నారు. వైస్ చైర్మన్‌గా పోటీ ఉంది. ఏక్రగీవంగా ఎన్నికైన వారిలో మొదటి నియోజకవర్గం నుంచి బొమ్మన జయకుమార్, ప్రసాదుల హరనాథ్, ఆర్.విజయశేఖర్ (రొబ్బి), ఎం.లక్ష్మణరావు, జామిశెట్టి గాంధీ, ద్వారా పార్వతీసుందరి, కనకం నాగేశ్వరరావు, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు, రెండో నియోజకవర్గం నుంచి యాండ్రపు రామకృష్ణ, మూడో నియోజకవర్గం నుంచి జామికృష్ణ ఎన్నికయ్యారు.

పొలంలో గుళికలు చల్లుతుండగా అస్వస్థత 6

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నలుగురు టీడీపీ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జవహర్

కొవ్వూరు, ఆగస్టు 18: టీడీపీ కంటెంట్‌ను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లిన నలుగురు కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అందించారు. నియోజకవర్గానికి చెందిన ఆకుల లావణ్యలక్ష్మి, రావిపాటి శ్రీకృష్ణ, చవ్వాకుల వీవీ సత్యనారాయణ, బూరుగుపల్లి శ్రీనివాస్ సోషల్ మీడియాలో టీడీపీ కంటెంట్‌ను ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రచారం చేశారు. దీనిపై నలుగురిని అభినందిస్తూ పార్టీ జాతీయ కార్యాలయం నుంచి మంత్రి నారా లోకేశ్ ప్రశంసాపత్రాలను పంపించారు. వాటిని ఆదివారం రాజమహేంద్రవరంలోని టీడీపీ కార్యాలయంలో జవహర్ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో వేగి చిన్నా, బూరుగుపల్లి రాఘవులు, కోడూరి ప్రసాద్, బోసు తదితరులు పాల్గొన్నారు.

ఆశిష్‌లాల్ పుట్టినరోజు

కొవ్వూరు, ఆగస్టు 18: రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశిష్‌లాల్ పుట్టినరోజును కొవ్వూరులో ఆదివారం నిర్వహించారు. స్థానిక టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానుల మధ్య ఆశిష్‌లాల్ కేక్ కట్ చేశారు. ఆయనకు కేఎస్ జవహర్ దంపతులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాయామోపాధ్యాయుల జోన్ కార్యవర్గ ఎన్నిక



నిడదవోలు జోన్ వ్యాయామోపాధ్యాయుల నూతన కార్యవర్గం

నిడదవోలు, ఆగస్టు 18: వ్యాయామోపాధ్యాయుల నిడదవోలు జోన్ నూతన కార్యవర్గాన్ని మండలంలోని పురుషోత్తపల్లిలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఎన్‌వీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా పి.రాజు, జనరల్ సెక్రటరీగా బి.ప్రదీప్, కోశాధికారిగా ఎమ్.వీరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్‌డీఎస్ జేమ్స్, జాయింటు సెక్రటరీగా కె.గంగాధర్, మహిళా రిప్రజెంటేటివ్‌గా కె.దుర్గ, నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్‌గా నరసింహులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ కో ఆర్డినేటర్‌గా ఎన్‌టీ రామారావులను ఎన్నుకున్నారు.

టీడీపీ నాయకుడు బాబ్జి మృతికి సంతాపం



బాబ్జి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, ఆగస్టు 18: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఇల్లూరి బాబ్జి ఆదివారం హఠాన్మరణం చెందారు. దీంతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు, పలువురు నాయకులతో కలిసి బాబ్జి మృతదేహానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. బాబ్జి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాబ్జీ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో అన్నమరెడ్డి సత్తిబాబు, అల్లూరి రాంబాబు, రేకపల్లి ముత్యాలరావు, సిద్దా దుర్గారావు, కైగాల శ్రీనివాసు, చలపాటి ప్రకాశం, కొఠరు వెంకట్రావు, కాకర్ల వంశీ పాల్గొన్నారు.

చోడసాని కుటుంబానికి పరామర్శ

నల్లజర్ల, ఆగస్టు 18: మాతృవియోగంతో బాధపడుతున్న చోడవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజును చీపురుగూడెం కూటమి నాయకులు ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, చెల్లు పెద్దరామన్న, చెల్లు సత్యనారాయణ, చెల్లు సుబ్రహ్మణ్యం, జవ్వాది పల్లపరాజు, కొండవీటి రమేష్ పాల్గొన్నారు.

బాపిరాజును కలిసిన సీఐ శ్రీనివాస్



నల్లజర్ల, ఆగస్టు 18: నల్లజర్ల సీఐ, ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్రీనివాస్, శ్రీహరిబాబు ఆదివారం జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏలేటి సత్యనారాయణ(జేడీ) రావూరి వెంకట రమణ, అలపాటి సత్యనారాయణ, గుంటముక్కల వేణు, నాదేళ్ల శ్రీరామ్ పాల్గొన్నారు.

నల్లజర్ల ఎస్ఐగా శ్రీహరిబాబు



నల్లజర్ల, ఆగస్టు 18: నల్లజర్ల ఎస్ఐగా శ్రీహరిబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నిన్నటి వరకు ఇక్కడ పనిచేసిన టీవీ రమేష్ బదిలీపై నరసాపురం వెళ్లగా తాడేపల్లిగూడెం రైల్వేలో పనిచేస్తున్న శ్రీహరిబాబు నల్లజర్ల విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై, కోడి పందేలు, పేకాట ఆడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీనక్కిళ్ళమ్మ, సోమాలమ్మ మంగళసూత్రాల ఉత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గోపాలపురం, ఆగస్టు 18: గోపాలపురం గ్రామ దేవత శ్రీనక్కిళ్లమ్మ, సోమాలమ్మ అమ్మవార్ల మంగళసూత్రాలు, కిరీటాల ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద మేళతాళాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో మంగళసూత్రాలు, కిరీట అలంకరణ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తిపై చాకుతో దాడి

కొవ్వూరు, ఆగస్టు 18: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై చాకుతో దాడిచేసి గాయపర్చిన సంఘటన కొవ్వూరులో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..స్థానిక రైతుబజారు సమీపంలో నివసిస్తున్న జయరాజు బస్టాండ్ సెంటర్‌లోని మద్యంషాపులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 4గంటల సమయంలో పిండి సుబ్రహ్మణ్యం మద్యం షాపు వద్దకు వచ్చి మద్యం కావాలని అడిగాడు. జయరాజు లేదని చెప్పడంతో సుబ్రహ్మణ్యం తనతో పాటు తెచ్చుకున్న చాకుతో జయరాజు ముఖం, తల, చేతులు, చాతిపై దాడిచేసి గాయపర్చి పారిపోయాడు. దీంతో అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తామిద్దరం గతంలో ఘర్షణపడ్డామని, అప్పుడు సుబ్రహ్మణ్యం చంపుతానని బెదిరించాడని జయరాజు పోలీసులకు తెలిపాడన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, బాధితుడి ఫిర్యాదుతో సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, ఆగస్టు 18: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ జె.ధర్మరాజు తెలిపారు. కొవ్వూరు మండలం కాపవరంలో కిళ్లీషాపులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం దాడిచేశారు. మెంటిమి పవన్‌కుమార్‌ను అరెస్టుచేసి, అతడి నుంచి 2బీరు సీసాలు, 8 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ఉండ్రాజవరం, ఆగస్టు 18: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19నుంచి 21వ తేదీ వరకు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీవీఎస్ రామకృష్ణంరాజు తెలిపారు. ఈ తరగతులకు మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా హాజరుకావాలని చెప్పారు.

మనకెందుకు!

- చెట్ల కొమ్మలు తొలగింపులో సమన్వయ లోపం
- క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజానీకం



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోనే వదిలివేసిన రావి చెట్టు దుంగలు



కొవ్వూరు, ఆగస్టు 18: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో నరికివేసిన చెట్టు కొమ్మల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వశాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఉన్న దేవతావృక్షం(రావిచెట్టు) కొమ్మ విరిగిపడింది. దానిని తొలగించవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆ పనిని ప్రైవేటు వ్యక్తులకు నోటిమాటగా తెలిపారు. వారేమో విరిగిన కొమ్మ తొలగింపు పేరుతో చెట్టును దాదాపు 70% నరికివేస్తుండగా బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ అడ్డుకుని మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్‌లకు ఫిర్యాదుచేశారు. కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా గోష్పాదక్షేత్రం తమ పరిధిలోది కాదని మున్సిపల్ అధికారులు బదులివ్వడంతో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లకు ఫిర్యాదుచేశారు. ఈ నెల 7న కొవ్వూరు మండలం కుమారదేవం గోదావరి ఒడ్డున నెలకొరిగిన సినిమాచెట్టును పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి దృష్టికి గోష్పాదక్షేత్రం ఘటనను మీడియా ప్రతినిధులు తీసుకురాగా ఆమె స్పందిస్తూ విచారించి చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌కు సూచించారు. దీంతో సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, అటవీశాఖ అధికారులు, రోటరీక్లబ్ ప్రతినిధులు గోష్పాదక్షేత్రానికి విచ్చేసి రావిచెట్టును పరిశీలించారు. అనుమతులేకుండా ప్రభుత్వ స్థలంలో దేవతావృక్షాన్ని నరికివేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదుచేసి కేసునమోదు చేయించాలని ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు, పట్టణ సీఐలను ఆదేశించారు. క్షేత్రంలో చెట్టు కొమ్మలను నరివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో సైదారాణి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

అయితే సబ్ కలెక్టర్ ఆదేశించి 11 రోజులు పూర్తి కావస్తున్నా నరికివేసిన చెట్టు కొమ్మలను రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు తమకు సంబంధం లేదంటూ అలాగే వదిలివేశారు. ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో తాము ఎలాగూ బదిలీపై వెళ్లిపోతాం ఈ సమయంలో ఇదంతా మనకు అవసరమా అంటూ అధికారులు ఎవరు ఏమి చెప్పినా తమకు ఏదీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దేవతావృక్షం చెట్టుకొమ్మలు యాగాలు, హోమాలలో వాడుతుంటారు. సుమారు ట్రాక్టరు లోడ్ అయ్యే చెట్టుకొమ్మలను అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేయడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి తక్షణం క్షేత్రంలో ఉన్న చెట్టుకొమ్మలను తొలగించి, నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాతేరు గణపతినగర్‌లో రోడ్డుపై వదిలేసిన చెట్టుకొమ్మల చెత్త

కాతేరులో ట్రాన్స్‌కో సిబ్బంది నరికిన కొమ్మలు అలాగే వదిలేశారు..

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 18: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో పంచాయతీ పారిశుధ్య విభాగం వారి తీరు దారుణంగా వుంది. ఎన్నిసార్లు కథనాలు రాసినా, ప్రజల నుంచి అనేక సార్లు ఫిర్యాదులు వస్తున్నా సిబ్బంది తీరులో మార్పు రావడంలేదు. వారం రోజుల క్రితం గ్రామంలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది నరివేయించారు. వాటిని రోడ్డు పక్కన అలానే వదిలేశారు. అయితే వాటిని తొలగించాల్సిన పంచాయతీ పారిశుధ్య విభాగం వారు నిర్లక్ష్యంగా వదిలేసారు. ఎవరికి వారు మాకు సంబంధంలేదన్నట్టుగా వదిలేయడంతో ఆ కొమ్మలు చెత్తగా మారి రోడ్డుపైకి చేరి వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారాయి. కాతేరు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఇన్‌చార్జీలు సైతం ఆ చెత్తను చూసుకుంటూ వెళతున్నారే తప్ప వాటిని డంప్ చేసే ప్రయత్నం చేయడంలేదు. చెత్త తరలించే ట్రాక్టర్లు కూడా వెళతున్నాయి. కాని వాటిని తరలించడం లేదు. అసలే జ్వరాల సీజన్ కావడంతో ఇలాంటి చెత్తచెదారం పేరుకుపోయి ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. పంచాయతీ స్థాయిలో ఎలాగు పట్టించుకోవడం లేదు, కనీసం జిల్లా స్థాయి అధికారులైన స్పందిస్తే గ్రామంలో మెరుగైన పారిశుధ్యం సాధ్యమౌతుందని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో చెరువుగట్టు మలుపులోను, కొత్తగా కట్టిన చెరువుగట్టు వాకింగ్ ట్రాక్ గేటు వద్ద కూడా పెద్దఎత్తున చెత్త పేరుకుపోతోంది. జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేస్తే పరిస్థితి అర్థమౌతుందనే వాదన ప్రజల నుంచి వస్తోంది.

లారీలో గంజాయి అక్రమ తరలింపు

- రాజానగరంలో పట్టుకున్న పోలీసులు.. ఇద్దరి అరెస్టు
- 100 కిలోలు, లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుబడ్డ గంజాయిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాజానగరం, ఆగస్టు 18: విశాఖ ఏజెన్సీ నుంచి తమిళనాడుకు గుట్టు చప్పుడు కాకుండా లారీలో తరలిస్తున్న రూ.5 లక్షల విలువైన 100 కిలోల గంజాయిని రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్‌తో కలిసి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా వజపడి మండలం వెప్పిలైపట్టిపుదురు గ్రామానికి చెందిన మరిముత్తు ఆరుముగమ్, పెరంబుదూరు జిల్లా సిరుమతూర్ మండలం కుదిక్కుడు గ్రామానికి చెందిన వేల్ మురుగన్ విశాఖ ఏజెన్సీ నుంచి తమిళనాడుకు 100 కిలోలను గంజాయిని బస్తాలతో లారీలో తరలిస్తున్నారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్.ఐ మనోహర్ తమ సిబ్బందితో కలిసి ఆదివారం జాతీయ రహదారిపై రాజానగరం హైస్కూల్ జంక్షన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. విశాఖ ఏజెన్సీలో గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలోని సేలం నగరానికి తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకునేలా వ్యాపారం నిమిత్తం రవాణా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. వీరిలో వేల్ మురుగన్‌పై తిరుచ్చి పోలీస్‌స్టేషన్‌లో గతంలో గంజాయి కేసు నమోదైనట్టు డీఎస్పీ చెప్పారు. నిందితులతో పాటు రూ.5 విలువైన గంజాయి, లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు.

ఏడాదిలో రూ.25 లక్షలు విలువైన గంజాయి స్వాధీనం..

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాది కాలంగా ఏడు కేసులు నమోదు కాగా రూ.25 లక్షలు విలువైన 506.35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 22మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ వివరించారు. ఈ కేసులకు సంబంధించి రెండు లారీలు, ఒక వ్యాన్, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గంజాయి తాగడం, రవాణా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్.ఐ మనోహర్, హెచ్‌సీ నాగేంద్ర, వీఆర్వో అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సోయగాలు.. పూల రాఖీలు

కడియం నర్సరీల్లో కనువిందు చేస్తున్న పువ్వులు



కడియం, ఆగస్టు 18: దేశవ్యాప్తంగా పేరు గాంచిన కడియం నర్సరీల్లో ప్రకృతి సోయగాల పూలరాఖీలు కనువిందు చేస్తున్నాయి. సోదరప్రేమను ప్రదర్శించే ఆత్మీయ శుభతరుణం రక్షాబంధన్(రాఖీ పండుగ). ఈ పండుగ రోజు రక్షాబంధనాలు కట్టుకుని సోదరులు విలువైన కానుకలిచ్చి సోదరీమణుల పట్ల ఆత్మీయతను చూపిస్తారు. ఇటీవల పుట్టినరోజు, వివాహ వేడుకలకు బహుమతులు బదులు మొక్కలు ఇచ్చి పుచ్చుకునే సాంప్రదాయం నడుస్తోంది.

ఈ నేపథ్యంలో సోదరభావం కలకాలం సుఖ సంతోషాలతో ఉండాలని, పచ్చని చెట్టులా రోజు రోజుకీ ఎదగాలని ఆకాంక్షిస్తూ ఇటీవల మొక్కలు ఇచ్చి పుచ్చుకుంటున్నారు. అచ్చంగా రాఖీల్లాగే కనిపించే పూల మొక్కలు రక్షాబంధన్ వేళ కానుకలు అవుతున్నాయి. ఫ్యాసీఫ్లోరా శాస్త్రీయ నామంతో పిలిచే ఈ రాఖీపుష్పాలు విభిన్న పరిమళాల్లో, వివిధ ఆకృతులు, ఎరుపు, నీలం, తెలుపు తదితర విభిన్న రంగుల్లో విరబూస్తూ నర్సరీల్లో కనువిందు చేస్తున్నాయి. చక్కని పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ సన్నని రేకులు ఉంటూ అందంగా కనిపించే ఈ రాఖీపుష్పాన్ని కౌరవులు-పాండవులు పుష్పమని కూడా పిలుస్తుంటారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

- గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ ఆసుపత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు



భవనం ప్రారంభోత్సవంలో సూర్యనారాయణరెడ్డి, గౌతమ్‌రెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 18 : ప్రజలు కిడ్నీ వ్యాధులపై ముందస్తు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నూతన భవనాన్ని ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు వైద్య ప్రముఖులు ఆసుపత్రిలోని ఐసీయూ, లేబోరేటరీ, ఇన్ పేషెంట్ , ఆపరేషన్ థియేటర్ తదితర విభాగాలను ప్రారంభించారు. డాక్టర్ గౌతమ్ రెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జీవనశైలి మార్చుకోవడం ద్వారా కిడ్నీ, యూరాలజీ సంబంధిత వ్యాధులను నివారించవచ్చన్నారు. రాజమహేంద్రవరంలో అత్యున్నత ప్రమాణాలతో రోగులకు వైద్యసేవలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య సంస్థల ఛైర్మన్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పొలంలో గుళికలు చల్లుతుండగా అస్వస్థత

- 8 మంది కూలీలు ఆసుపత్రికి తరలింపు
- బిక్కవోలు మండలం పందలపాకలో ఘటన
- ఎమ్మెల్యే నల్లమిల్లి పరామర్శ



కూలీలను 108 సహాయంతో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

అనపర్తి, ఆగస్టు 18: బిక్కవోలు మండలం పందలపాకలో వరి పొలంలో గుళికలు చల్లుతూ ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌ల సహాయంతో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన రైతు శ్రీధర్ నారాయణరెడ్డి తన 15 ఎకరాల వరి పొలంలో గుళికలు చల్లేందుకు పందలపాక, ఊలపల్లి, మాచవరం గ్రామాలకు చెందిన తొమ్మిది మంది కూలీలను నియమించుకున్నారు. వీరు తొమ్మిది ఎకరాల్లో చల్లి కొంత సేపు సేదదీరారు. అంతలో మరో కూలీ తెచ్చిన మజ్జిగను తాగి తిరిగి పనికి ఉపక్రమించారు. కొద్ది సేపటికే పందలపాకకు చెందిన టి.విజయ్‌కుమార్, సీహెచ్ దుర్గారావు, పి.రాంబాబు, వై.వినోద్‌కుమార్, మాచవరం గ్రామానికి చెందిన విజ్జన శ్రీను, పలివెల యాకోబు, తాతపూడి గోవిందు, ఊపల్లికి చెందిన ఆర్.వెంకటరమణలకు కళ్లు తిరుగుతూ ఊపిరి తీసుకోవడం కష్టమైంది. దీంతో యజమాని 108కి సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించి అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు సేవలు ప్రారంభించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నాతిక బాబూరావు తదితరులున్నారు.

కాలువకు గండి.. నీటమునిగిన నర్సరీలు

లక్షల్లో ఆస్తినష్టం



కాలువకు గండి పడి నీట మునిగిన నర్సరీలు

కడియం ఆగస్టు 18 : మండలంలో తూర్పు డెల్టాకాలువకు నీరు పోటెత్తి నర్సరీలను ముంచెత్తింది. కడియం, కడియపులంక, పొట్టిలంక గ్రామాల్లో నర్సరీలను ఆనుకుని ఉన్న పెద్దకాలువ గట్టుకు ఆదివారం గండిపడింది. దీంతో నర్సరీల్లో తోటలు నీట మునిగిపోయాయి. 40 ఏళ్లుగా తూర్పు డెల్టాకాలువకు ఇటువంటి పరిస్థితిలేదు. కడియపులంకకు చెందిన రైతు బాదం పెదకాపు అరెకరం పొలంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నిమ్మమొక్కల అంట్లు కూడానీట మునిగాయి. సుమారు రూ.10 లక్షలు నష్టవాటిల్లిందని రైతు వాపోయాడు. ఇండోర్ ప్లాంట్స్, అరటి, దొండ పంటలకు నష్టం జరిగింది. అధికారుల నిర్లక్ష్యం వల్లనే కాలువకు గండి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువెళ్లారు.

కోలమూరులో 750 మొక్కలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 18: అమ్మఒడి సేవా తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం కోలమూరులో 750 మొక్కలు నాటారు. ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ విభాగం, చేతనా ప్రకృతి సేవా సంస్థ సహకారంతో మొక్కలు నాటామని సేవా తరంగిణి అధ్యక్షుడు విజయస్వామి తెలిపారు.ఈ మేరకు జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అభినందించారన్నారు. కార్యక్రమంలో సభ్యులు కె.నాగవెంకట ధనలక్ష్మి, బి.నాగమణి, ఐవీవీ సత్యనారాయణ, లోకేష్, దొరబాబు, కె.దుర్గాభవాని, సాయిభరద్వాజ్ పాల్గొన్నారు.

చాలా శక్తివంతమైనది ఫొటో

ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి కందుల దుర్గేష్



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 18: ఫొటో చాలా శక్తివంతమైనదని.. ఆనందమైనా.. బాధయినా ఫొటో ఉండాల్సిందేనని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సిని మాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా రాజమండ్రి గోదావరి గట్టున ఉన్న మల్లిగ సత్రంలో గోదావరి వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక్క ఫొటో వంద భావాలను పలికిస్తుందని.. ఒక్క ఫొటో ఎంత పెద్ద విషాదన్నయినా కళ్లకు కట్టినట్టు చూపిస్తుందన్నారు. సోమవారం ఫొటో ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. డాక్టర్ రవీంద్ర డ్రోన్ కెమెరాతో తీసిన అద్భుత ఛాయాచిత్రాలు ఎంతో రమణీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ ద్రోణంరాజు భగవాన్ రాజు,ఆర్ఎస్ న్యూరో హాస్పిటల్ అధినేత డాక్టర్ రవీంద్ర కాపుప్రసాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వజ్రాల నాగేంద్రప్రసాద్, వంశీకృష్ణ, ఓఎన్‌జీసీ సంతోష్‌కుమార్, ఎఫ్‌సీఐ మేనేజర్ సీఎస్ఎన్ మూర్తి, ఓఎన్‌జీసీ నరేంద్ర,చంద్రదాస్ దేశవిదేశాల్లో తీసిన ఛాయాచిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మిస్టర్ బచ్చన్
వై.స్క్రీన్2	తంగలన్
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
రాధాకృష్ణ	ఆయ్, తంగలన్
శ్రీగణపతి	డబుల్ ఇస్మార్ట్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---